
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 36.2 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY



ప్రజాఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి

- పోలీసు అధికారులకు ఎస్పీ రత్న ఆదేశం



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు సమర్పించే అర్జీలపై సత్వరమే విచారణ చేపట్టి, చట్టపరిధిలో ఉన్న వాటిని సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ రత్న.. సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజలు 60 ఫిర్యాదులు సమర్పించారు. వాటిని ఎస్పీ స్వీకరించి, వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో ఉన్న వాటికి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ పాల్గొన్నారు.



మండేకాలం.. జాగ్రత్త..

- వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం
- ముందు జాగ్రత్త చర్యలు తప్పనిసరి

(వివరాలు 6లో..)

క్రీడల్లోనూ వైసీపీ అవినీతి

- బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో 'ఆడుదాం.. ఆంధ్ర' తదితరాల ద్వారా క్రీడల్లో సైతం అక్రమాలకు పాల్పడిన పార్టీ వైసీపీ అని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత మండిపడ్డారు. క్రీడలను జాతీయస్థాయికి తీసుకెళ్లిన ఘనత కూటమికి దక్కుతుందని మంత్రి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం వ్యాయామశాల నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ.. శాప్ నిధులతో వ్యాయామ శాల నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో క్రీడాపోటీలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వైసీపీ పాలనలో ఆడుదాం.. ఆంధ్రలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. వాటిపై విచారణ సాగుతోందని మంత్రి వివరించారు. కార్యక్రమంలో అధికారులు నాయకులు కేశవయ్య, గుట్టూరు సూరి, కన్వీనర్ శ్రీరాములు పాల్గొన్నారు.



వ్యాయామశాలకు భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి టౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలిచ్చిన అర్జీలకు సంబంధిత అధికారులు అధిక ప్రాధాన్యం ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని జేసీ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జేసీ పాల్గొని ప్రజల నుంచి 227 అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలిచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఒకసారి వచ్చిన అర్జీ మరోసారి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, భూసమస్యలపై వచ్చిన అర్జీలను హెచ్‌ఓడీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాల న్నారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారథి, ఆర్డీఓ సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

29లోపు ఈకేవైసీ పూర్తి చేయాలి

జిల్లాలోని రేషన్‌కార్డు లబ్ధిదారులు ఈనెల 29లోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని జేసీ సోమవారం ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు కార్డులోని లబ్ధిదారులందరూ వేలిముద్రలు వేసి, ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. లేని పక్షంలో రేషన్‌కార్డులో పేర్లు తొలగించబడతాయన్నారు. డీలర్లు, గ్రామ, వార్డు సచివాలయాల్లో ఐదు సంవత్సరాల పైబడిన వారు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

నేడే ఆంధ్రజ్యోతి లక్కీడ్రా

ఆంధ్రజ్యోతి అనంతపురం యూనిట్ కార్యాలయంలో మంగళవారం కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రా తీస్తారు. ఉదయం 11 గంటలకు కార్యక్రమం జరుగుతుంది.

6

వైసీపీ నాయకుల చెరలో ఉన్నారని బంధువుల ఆందోళన

గాండ్లపెంటలో హైడ్రామా...!

- 27న ఎంపీపీ ఎన్నిక
- వైసీపీ నాయకులపై కేసు

కనిపించని ఎంపీటీసీలు





కదిరి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కదిరి నియోజకవర్గంలోని గాండ్లపెంటలో గత మూడురోజులుగా హైడ్రామా నడుస్తోంది. ఖాళీగా ఉన్న ఎంపీపీ స్థానానికి ఈనెల 27న ఎన్నిక జరగనుంది. గత మూడురోజులుగా కొంతమంది ఎంపీటీసీలు మండలంలో కనిపించ లేదని చర్చలు వినిపిస్తున్నాయి. ఆదివారం రాత్రి తమ వదిన, చామాలగొంది ఎంపీటీసీ, ఆమె భర్తతోపాటు పిల్లలు కూడా కనిపించలేదని మరిది రవికుమార్‌నాయక్ కదిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు వైసీపీ నాయకుడు మగ్బుల్‌తోపాటు మరికొంత మంది మీద కేసు నమోదు చేశారు. కనిపించని మండల ప్రజాప్రతినిధులు వైసీపీ నాయకుడి చెరలో ఉన్నట్లు వారి కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గాండ్లపెంట మండలంలో ఈహైడ్రామా కొనసాగుతోంది.

ఆ నలుగురు ఏమయ్యారు..?

గాండ్లపెంట మండలానికి చెందిన నలుగురు ఎంపీటీసీలు గత మూడురోజులుగా కనిపించ లేదని సమాచారం. వారు ఎక్కడున్నారో ఆచూకీ తెలపాలని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ బంధువులు కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీపీ ఎన్నిక ఉండడంతో తమ బంధువులను ఎవరైనా కిడ్నాప్ చేశారా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారు ఎక్కడున్నా పోలీసులు తక్షణం తీసుకురావాలని కోరుతున్నారు.

27న ఎంపీపీ ఎన్నిక

ఈనెల 27న గాండ్లపెంట మండల ఎంపీపీ ఎన్నిక జరగనుంది. గతంలో ఎంపీపీగా ఉన్న జగన్ రాజీనామా చేశారు. దీంతో ఇన్‌చార్జ్ ఎంపీపీగా కటారుపల్లికి చెందిన ఎంపీటీసీ గంగోజమ్మ కొనసాగుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంపీపీ, ఇతర ప్రజాప్రతినిధుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో గాండ్లపెంట ఎంపీపీ ఎన్నిక ఈనెల 27న జరగనుంది. మండలంలో ఏడు ఎంపీటీసీలకు గాను.. వైసీపీకి ఐదుగురు, టీడీపీకి ఇద్దరు ఉన్నారు. ఎంపీటీసీల్లో కొంతమంది టీడీపీకి మద్దతు తెలుపుతామని చెప్పినట్లు సమాచారం. దీనికి భయపడే వైసీపీ నాయకులు ఎత్తులు వేస్తున్నట్లు తెలిసింది.

వైసీపీ నాయకుల చెరలో ఎంపీటీసీలు?

నియోజకవర్గానికి చెందిన కొంతమంది వైసీపీ నాయకులు గాండ్లపెంట మండలానికి చెందిన కొందరు ఎంపీటీసీలను గత మూడురోజులుగా వారి చెరలో ఉంచుకున్నట్లు సమాచారం. నలుగురు ఎంపీటీసీలు బెంగళూరులో ఉన్న ఓ నాయకుడి ఇంటికి సమీపంలో ఉన్నట్లు తెలిసింది. ఏవిధంగానైనా ఎంపీపీ స్థానాన్ని దక్కించుకోవాలని ఆ నాయకుడు ఎంపీటీసీలను తన చెరలోనే ఉంచుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఎన్నిక పూర్తయ్యేవరకు ఇక్కడే ఉండాలని వారిని ఆదేశించినట్లు సమాచారం. వారికి ఇష్టం లేకపోయినా.. ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అభివృద్ధి వైపు పయనించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు తెలపడానికి మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. ఈ సమాచారం అందుకున్న కొంత మంది వైసీపీ నాయకులు మూడురోజుల క్రితం ఎంపీటీసీలను తమ అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

వైసీపీ నాయకులపై కేసు

తమ అన్న, వదిన, (చామాలగొంది ఎంపీటీసీ లక్ష్మీదేవి) ఈనెల 22 నుంచి కనిపించడంలేదని లక్ష్మీదేవి మరిది గాజువారిపల్లి పెద్దతండాకు చెందిన బూక్యె రవికుమార్‌నాయక్ ఈనెల 23న పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ అన్న, వదినను కారులో కదిరివైపు తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వైసీపీ నాయకులు మగ్బుల్‌బాషా, శ్రీకాంత్‌రెడ్డి, అత్తార్‌చాంద్‌బాషా, పరికి సాదిక్, పరికి షామీర్ పేర్లను ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ మేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు రవికుమార్ మాట్లాడుతూ.. ఫిర్యాదు ఇచ్చి 48 గంటలైనా పోలీసులు ఇంతవరకు స్పందించలేదని, తమ అన్న, వదిన ఆచూకీ తెలపాలని వీడియో ద్వారా పోలీసులను కోరుతున్నాడు.

ఇన్విజిలేటర్ల సస్పెన్షన్

కదిరిలో మాస్ కాపీయింగ్

పుట్టపర్తి/కొత్తచెరువు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కదిరి పట్టణంలో సోమవారం పదో తరగతి గణిత పరీక్షలో మాస్ కాపీయింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఇన్విజిలేటర్లను సస్పెండ్ చేసినట్లు ఉమ్మడి జిల్లా పదో తరగతి పరీక్షల పరిశీలకుడు, జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు తెలిపారు. కదిరి కాలేజ్ సర్కిల్, బస్టాండ్ రోడ్డులోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాలను పరీక్షల పరిశీలకుడు సుబ్బారావు, ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేశాయి. ఏ, బీ కేంద్రాల్లో కిటికీల వద్ద కాపీ స్లిప్పులు కనిపించాయి. గదుల వెనుక భాగంలోని ఓపెన్ స్కూల్ సెంటర్లలో స్లిప్పులు దర్శనమిచ్చాయి. బయటి నుంచి గదుల్లోకి స్లిప్పులను విసరడం, వాటిని కొందరు గోడలు దూకి పరీక్షాకేంద్రం లోపలికి వేస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఏ సెంటర్‌లో ఇన్విజిలేటర్లు ఎస్‌జీటీ రుద్రంరెడ్డి, కిష్టను సస్పెండ్ చేశారు. వారి స్థానంలో వేరే వారిని ఇన్విజిలేటర్లుగా నియమించారు. ఏ, బీ సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులను పరీక్ష విధుల నుంచి తొలగించి, కొత్తవారిని నియమించారు. ఆయాకేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, శాఖాధికారులను వివరణ కోరుతూ ప్రభుత్వ పరీక్షల విభాగ సంచాలకుడు కేవీ శ్రీనివాసులరెడ్డి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలోని ముదిగుబ్బ పరీక్ష కేంద్రంలో ఓ విద్యారి మాస్ కాపీయింగ్ చేస్తూ.. పట్టుబడగా డిబార్ చేశారు. ఇదే సెంటర్‌లో ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న టీచర్ మహమ్మద్ రఫీని సస్పెండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా సోమవారం జరిగిన గణితం పరీక్షకు 145 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈఓ కిష్టప్ప తెలిపారు. 21,629 మందికి గానూ 21,484 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

క్షయ పట్ల నిర్లక్ష్యం వద్దు : జేసీ



ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ

పుట్టపర్తిటౌన్, మార్చి24(ఆంధ్రజ్యోతి): క్షయ పట్ల ప్రజలు నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు పాటించాలని జేసీ అభిషేక్ కుమార్ సూచించారు. ప్రపంచ క్షయనిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని జేసీ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్షయ లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికెళ్లి చికిత్సలు చేయించుకోవాల న్నారు. క్షయ బాధితులకు ఉచిత మందులతో పాటు, నెలకు రూ. వెయ్యి చొప్పున ఆరునెలలు ప్రభుత్వం ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి జైజక్షన్ వరకు ర్యాలీ చేసి సిబ్బంది, ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఫిరోజ్ బేగం, జిల్లా క్షయ నిర్మూలనాధికారి డాక్టర్ తిప్పయ్య, పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, వైద్యాధికారులు వాసుదేవరెడ్డి, గాయత్రి తదితరులున్నారు.

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

- రైతులకు మంత్రి సవిత భరోసా
- నీర్జాంపల్లి, గొడ్డుమర్రిలో పర్యటన
- దెబ్బతిన్న అరటి తోటల పరిశీలన



రైతుతో మాట్లాడుతున్న మంత్రి

అనంతపురం టౌన్/యల్లనూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వర్షాలకు పంట దెబ్బతిన్నందుకు రైతులెవరూ అధైర్యపడొద్దని, ప్రభుత్వం ఆదుకుంటుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. యల్లనూరు మండలం నీర్జాంపల్లి, గొడ్డుమర్రి గ్రామాల పరిధిలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పండ్ల తోటలను ఆమె సోమవారం పరిశీలించారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు. పలువురు రైతులు మంత్రి, ఎమ్మెల్యే ఎదుట కన్నీటిపర్యంతమయ్యారు. చేతికి వచ్చిన పంట దెబ్బతినడంతో రైతుల బాధ వర్ణనాతీతంగా ఉందని మంత్రి మీడియాతో అన్నారు. అకాల వర్షాలతో కడప, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 1,547 హెక్టార్లలో పంట నష్టం జరిగిందని తెలిపారు. మొత్తం 1,240 మంది రైతులు రూ.60 కోట్ల వరకు నష్టపోయారని తెలిపారు. హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు నివేదికను తయారుచేస్తున్నారని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని అన్నారు. హెక్టారుకు రూ.35 వేలు ఇన్‌పుట్ సబ్సిడీ, ఎంఐడీహెచ్ పథకం కింద ఒక్కొక్క రైతుకు హెక్టారుకు రూ.70 వేలు ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. రైతులు ఆత్మహత్యల జోలికి వెళ్లవద్దని

(తరువాయి 7లో..)

నీటి కోసం రోడ్డెక్కిన ప్రజలు

గంటపాటు కేతిరెడ్డి కాలనీవాసుల ఆందోళన



రోడ్డుపై మొద్దును అడ్డుగా వేస్తున్న కాలనీవాసులు



కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

ధర్మవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం కేతిరెడ్డికాలనీ లోని ఎల్-4 ప్రజలు రోడ్డెక్కారు. పట్టణంలోని కేతిరెడ్డికాలనీ ఎల్-4లో గత పది రోజుల నుంచి తాగునీరు సరఫరా కాలేదంటూ సోమవారం ఉదయం రోడ్డుపై నిరసన చేపట్టారు. తాగునీటి సమస్యపై పలు మార్లు మున్సిపల్ డీఈకి విన్నవించామని, అయినా పట్టించుకోలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయమే కూలి పనులకు వెళ్లే తాము తాగునీరు రాకపోవ డంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. తాగునీటి కోసం కూలిపనులు వదిలేసి ఇంటి వద్ద ఉంటూ పక్క కాలనీలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసన దాదాపు గంటపైగా జరగడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ నిరసన చేస్తున్న ప్రాంతానికి వచ్చి కాలనీ ప్రజలతో మాట్లాడారు. పైపులైన్ పనులు చేస్తుండటం వల్ల సమస్య తలెత్తిందని, తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు నిరసన విరమించారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.35 (మంగళవారం సాయంత్రం)

సెహరీ : 4.59 (బుధవారం ఉదయం)

జోరుగా ఈకేవైసీ

- ప్రతి లబ్ధిదారుడి బయోమెట్రిక్ తప్పనిసరి
- ఇప్పటిదాకా 89 శాతం పూర్తి
- నెలాఖరు వరకు గడువు



రేషన్ డీలర్ల వద్ద ఈకేవైసీ చేయించుకోవడానికి క్యూలో నిల్చున్న లబ్ధిదారులు

ధర్మవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్‌కార్డుల ఈకేవైసీ ప్రక్రియ జోరుగా సాగుతోంది. రేషన్ కార్డులోని ప్రతిలబ్ధిదారుడి బయోమెట్రిక్‌ను విధిగా ఈకేవైసీ వేయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా ప్రస్తుతం జిల్లాలో ఈ ప్రక్రియను పౌరసరఫరాల అధికారులు చేపట్టారు. జిల్లాలో 5,66,189 రేషన్ కార్డులుండగా వాటిలో 16,89,531 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇప్పటికే 15,15,934 మందికి(89 శాతం) ఈకేవైసీ పూర్తిగా కాగా ఇంకా 1,73,597 మందికి చేయించాల్సి ఉంది. మార్చి నెలాఖరులోగా వారందరినీ ఈకేవైసీ చేయిం చేందుకు చర్యలు చేపడుతున్నారు.

బోగస్ ఏరివేతే లక్ష్యం

బోగస్ కార్డుల ఏరివేతే లక్ష్యంగా ఈకేవైసీ ప్రక్రియ జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. గతంలో అనర్హులకు సైతం రేషన్‌కార్డులు మంజూరు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే కార్డులోని లబ్ధిదారులు మృతిచెందినా వారి పేర్లు తొలగించని పరిస్థితి ఉందని అధికారులు అంటున్నారు. దీంతో వారి పేరిట నెలకోటా రేషన్ పొందు తున్నారు. ఈ నేపథ్యంలో రేషన్‌కార్డుల్లోని లబ్ధిదారులందరి బయోమెట్రిక్ నమోదు చేయడంతో దాదాపుగా కార్డుల ప్రక్షాళన జరిగి వాస్తవ లబ్ధిదారులకు మాత్రమే రేషన్ పంపిణీ చేసేందుకు అవకాశం కలుగుతుందని డీలర్లు అంటున్నారు.

ఈకేవైసీ చేసుకుంటేనే ..

రేషన్ కార్డు లబ్ధిదారులు ఈకేవైసీ చేసుకుంటేనే భవిష్యత్తులో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందే అవకాశం ఉంటుంది. నెలాఖరులోగా ఈకేవైసీ చేయించుకోవాలిన ప్రభుత్వం గడువు విధించింది. అత్యంత కీలకమైన ఈ ప్రక్రియను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో సొంత గ్రామాలకు దూరంగా ఉండేవారికి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా రాష్ట్రంలో ఎక్కడినుంచైనా ఈకేవైసీ చేయించుకునేలా అవకాశాన్ని కూడా కల్పిస్తోంది. అయితే కొన్ని ప్రాంతాలలో సర్వర్ సమస్యతో ఆలస్యమవుతోంది.

ఈకేవైసీ చేయించకుంటే రేషన్‌కార్డు రద్దు?

ప్రస్తుత ప్రభుత్వ యంత్రాంగం చేపడుతున్న ఈకేవైసీని లబ్ధిదారులు చేయించుకోకుంటే వారి కార్డు రద్దు చేసే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఈకేవైసీ జరగని కారణంగా ఆ రేషన్‌కార్డు రద్దు జాబితాలో చేరిపోతోంది. అందువల్ల రేషన్‌కార్డు లబ్ధిదారులు విధిగా ఈకేవైసీ చేయించుకోవాలని సివిల్ సప్లై అధికారులు చెబుతున్నారు.

విధిగా పూర్తి చేయాలి

జిల్లాలో రేషన్‌కార్డు లబ్ధిదారుల ఈకేవైసీ ప్రక్రియను ఈనెలాఖరుకు ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలి. లబ్ధిదారులు ఈ విషయంలో గ్రామ సచివాలయాలు, రేషన్ డీలర్ల వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలి. నెలాఖరు వరకు గడువు ఉంది. లబ్ధిదారులు ఈకేవైసీ త్వరగా చేయించుకోవాలి. రేషన డీలర్లు, సివిల్ సప్లయ్ అధికారులు మరింత వేగంగా ఈకేవైసీ పూర్తి చేయాలి.

-వంశీకృష్ణారెడ్డి, డీఎస్ఓ, శ్రీసత్యసాయి జిల్లా





కర్రల సాయంతో విద్యుత్ తీగలను ఎత్తి ట్రాక్టర్‌తో దుక్కి చేస్తున్న రైతులు

చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు

సేద్యం చేయాలంటే అవస్థలు
విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం
రైతులకు అవస్థలు

విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో రైతులు అవస్థలు పడుతున్నారు. విడపనకల్లు మండలంలోని గడేకల్లు, కడదరబెంచి గ్రామాల మధ్యలోని పొలాల్లో విద్యుత్ తీగలు నేలకు తాకే ఎత్తులో ఉన్నాయని, సేద్యాలు చేయటానికి ఇబ్బందిగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడేకల్లు గ్రామానికి చెందిన రైతులు పొలాల్లో దుక్కి చేసుకోవటానికి ఇబ్బంది పడుతున్నారు. అంజినయ్య, భీమలింగప్ప పొలాల్లో విద్యుత్ తీగలు చేతికి అందే ఎత్తులో ఉన్నాయి. దుక్కి దున్నుతున్న సమయంలో ట్రాక్టర్‌కు విద్యుత్ తీగలు తగిలే ప్రమాదం ఉండడంతో రైతులు ముందు జాగ్రత్తగా కర్రల సాయంతో వాటిని పైకి ఎత్తి పట్టుకుంటున్నారు. పొలంలో సేద్యం చేయాలంటే ప్రస్తుతం ముగ్గురు కూలీలు అవసరమవుతారని రైతులు అంటున్నారు. విద్యుత్ తీగలను కర్రలతో పైకి ఎత్తిపట్టుకోవటానికి ఇద్దరు, ట్రాక్టర్ వెనుక ఒకరు ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని ప్రశ్నిస్తున్నారు. వెంటనే వేలాడుతున్న విద్యుత్ తీగలను మరమ్మతులు చేసి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి, విడపనకల్లు



గడేకల్లు వద్ద పొలంలో చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు

హంద్రీనీవాకు 29 టీఎంసీలు



హంద్రీనీవా కాలువలో ఆగిపోయిన నీటి ప్రవాహం

గుంతకల్లు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవాలో గత మూడేళ్లతో పోలిస్తే ఈ సంవత్సరం అధిక మోతాదులో నీటి ఎత్తిపోతలు జరిగాయి. వైసీపీ హయాంలో 2021-22 సీజన్ మినహా కనీసం 25 టీఎంసీల మార్కును దాటి నీటిని పారించలేకపోయారు. 2024-25 సీజన్‌లో గత వారం హంద్రీనీవాలో ఎత్తిపోతలు నిలిపేశారు. మొత్తంపై 28.9 టీఎంసీల నీటిని పంపుచేశారు. ప్రభుత్వం అనుకున్నట్టుగానే శ్రీశైలం డ్యాంలో ఇంకా తగినన్ని నీటి నిల్వలు ఉండగానే హంద్రీనీవాకు ఎత్తిపోతలను నిలిపివేశారు. దీంతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించిన ఏడేళ్లలో తొలిసారిగా హంద్రీనీవాకు ఆ ప్రాజెక్టు నుంచి ప్రత్యామ్నాయంగా నీటిని తోడుకునే అవసరం లేకుండాపోయింది. హెచ్ఎన్ఎస్ఎస్‌లో 220 రోజులపాటు ఏకధాటిగా నీటిని ఎత్తిపోసినా ఈ సంవత్సరం 40 టీఎంసీల మ్యాజిక్ ఫిగర్‌ను చేరుకోలేకపోయారు.

శ్రీశైలం డ్యాంలో నీరున్నా..

సాధారణంగా శ్రీశైలం డ్యాంలో 835 అడుగుల స్థాయి వరకూ మల్యాల పంప్‌హౌస్ వద్ద హంద్రీనీవాలోకి నీటిని ఎత్తిపొయ్యడానికి సాధ్యపడుతుంది. 2017లో కేసీ కెనాల్ కోసం నిర్మించిన ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా 814 అడుగుల స్థాయి వరకూ నీటిని తోడుకోవచ్చు. ఈ కారణంగా మల్యాల పంపులు ఆగిన తర్వాత కూడా ముచ్చుమర్రి పంపుల ద్వారా కూడా హంద్రీనీవాకు నీటిని ఇవ్వడానికి ఆ ప్రాజెక్టును రూపకల్పన చేసి 2017లో చంద్రబాబు నాయుడు జలహారతి కార్యక్రమం కింద ప్రారంభించారు. అప్పటి నుంచి డ్యాంలో నీటి నిల్వలు తగ్గిపోయి మల్యాల పంపుహౌస్ పనిచేయకపోతే, ప్రత్యామ్నాయంగా ముచ్చుమర్రి పథకం ద్వారా హంద్రీనీవాకు తక్కువ మోతాదులో నీటిని పారించేవారు. అలా గడచిన ఏడేళ్లు ముచ్చుమర్రి పథకం నుంచి హంద్రీనీవాకు నీటిని ఇచ్చారు. కానీ, ఈ సంవత్సరం డ్యాంలో తగినన్ని నీటి నిల్వలను ఉంచాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పంటలన్నింటికీ తుది తడులు పూర్తయిన వెంటనే హంద్రీనీవాకు ఎత్తిపోతలను నిలిపివేసింది. ప్రస్తుతం 837.4 అడుగుల నీటి నిల్వ ఉంది. ఇదివరకైతే 814 అడుగుల స్థాయి వరకూ నీటి ఎత్తిపోతలు జరిగేవి. దీర్ఘకాలిక పంటలైన కంది, మిర్చి పంటలు కూడా పూర్తికావడంతో ఇక సాగునీరు అక్కర్లేదని భావించి రైతుల సమ్మతితో హంద్రీనీవాకు పంపింగ్‌ను నిలిపివేశారు.

మూడేళ్లలో గరిష్ఠం

2024-25 సీజన్‌కు సంబంధించి గతవారం హంద్రీనీవా నుంచి జిల్లాకు నీటి ప్రవాహం నిలిచిపోయింది. మొత్తంపై 28.9 టీఎంసీల నీరు హంద్రీనీవాలో పారించారు. గడచిన మూడు సీజన్లతో పోలిస్తే ఎక్కువ స్థాయిలో పారించినట్లయింది. 2021-22 సీజన్‌లో హంద్రీనీవాలో 25.56 టీఎంసీలు నీరు పారగా, 2022-23 సంవత్సరంలో 23.7 టీఎంసీలు, 2023-24 సంవత్సరంలో 21.2 టీఎంసీలు మాత్ర మే పంపు చేయగలిగారు. ఈ లెక్కన 2020-21 సీజన్‌తో పోలిస్తే తర్వాతి సంవత్సరంలో 14.5 టీఎంసీలు, 2021-22 సంవత్సరంలో పోలిస్తే తదుపరి సంవత్సరం దాదాపు 2 టీఎంసీలు, 2022-23తో పోలిస్తే 2023-24 సీజన్‌లో హంద్రీనీవాకు రెండు టీఎంసీల నీటి కోత ఏర్పడింది. ఈ సంవత్సరం గత మూడేళ్ల రికార్డులు అధిగమించి 28.9 టీఎంసీలను నీటిని పారించారు. ఇందులో జిల్లాలోకి 24.5 టీఎంసీల నీరు వచ్చి ఎగువకు పారగా, కర్నూలు జిల్లాకు 4.4 టీఎంసీలు లభించాయి. ఇదిలా ఉండగా, హంద్రీనీవాకు నీరు నిలిచిన వెంటనే వెడల్పు పనులు చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్న కారణంగా ఏప్రిల్ వరకూ నీటిని పారించే అవకాశం ఉన్నా ఎత్తిపోతలకు బ్రేక్ వేసినట్టు సమాచారం.



మండేకాలం.. జాగ్రత్త

వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం

ముందు జాగ్రత్త చర్యలు తప్పనిసరి

ధర్మవరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చేసింది. ఎండలు మండిపోతున్నాయి. వాతావరణం అగ్గి సెగలా మారింది. ఇలాంటి స్థితిలో అగ్ని ప్రమాదాలు జరిగితే...! క్షణాల్లో సర్వం బుగ్గి అవుతుంది. ఆస్తి నష్టంతోపాటు ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంటుంది. అందుకే వేసవిలో ప్రజలు అగ్ని విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. ఎంతలేదనుకున్నా ఎండాకాలంలో ఎక్కడో ఒక చోట అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. కొందరు పొగరాయుళ్ల బీడీ, సిగరెట్లను ఆర్పకుండా నిర్లక్ష్యంగా పారేయడం వల్ల కూడా కొన్ని ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. నిప్పుపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్ని మాపక కేంద్రం సిబ్బంది హెచ్చరిస్తున్నారు. ధర్మవరం అగ్నిమాపక కేంద్రంలో 15 మంది సిబ్బంది, ముగ్గురు హోంగార్డులు, ఒక స్టేషన్ ఫైర్ ఆఫీసర్ విధులు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రం పరిధిలో ధర్మవరం, ధర్మవరం రూరల్, తాడిమర్రి, బత్తలపల్లి, సీకేపల్లి మండలాలు ఉన్నాయి. ఏడాదికాలంలో దాదాపు 60 అగ్నిప్రమాదాలు జరిగాయి. దాదాపు రూ.కోటికిపైగా నష్టం వాటిల్లినట్టు అధికారులు చెబుతున్నారు. ఐదు మండలాలకు ఒకే ఫైరింజన్ ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



ఆకతాయిలు చెత్తకు నిప్పుపెట్టడంతో చెలరేగిన మంటలు

తరచూ గడ్డివాముల దగ్ధం

గ్రామాల్లో రైతులు ఏర్పాటు చేసుకున్న గడ్డివాములు ఎండాకాలంలో తరచూ అగ్ని ప్రమాదాలకు గురవుతుంటాయి. గడ్డివాముకు గడ్డివాముకు కనీస దూరం 10మీటర్లు ఉండేలా ఏర్పాటు చేసుకుంటే నష్టం తగ్గే అవకాశం ఉందని అగ్నిమాపక అధికారులు చెబుతున్నారు. కరెంటు తీగల కింద గడ్డివామును వేయకూడదు. పచ్చి గడ్డి, ఎండు గడ్డి కలిపి వామి వేయకూడదు. దీని వల్ల ఎండ వేడిమికి మంటలు చెలరేగే అవకాశాలు ఉంటాయి. గడ్డిని పూర్తిగా ఎండబెట్టిన తరువాతే వామి వేసుకోవాలి. గడ్డివాముల దగ్గర బీడీ, సిగరెట్లు వంటి వి కాల్చరాదు. పొలాల్లో పంటలు చేతికొచ్చిన తరువాత మిగిలిన చెత్తకు రైతులు మంటలు పెట్టడం సర్వసాధారణం. అయితే ఆ మంటలు పూర్తిగా ఆరిపోయే వరకు అక్కడే ఉండటం వల్ల అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు.



గ్యాస్ సిలిండర్లు

- ప్రజలు ఎండాకాలంలో పెట్రోల్ బంకుల దగ్గర సెల్‌ఫోన్‌ల ఓఓ మాట్లాడటం చాలా ప్రమాదకరం. పెట్రోల్ బంకు యాజమాన్యం ఇసుక, మంటలను అదుపుచేసే డీసీపీ వంటి అన్ని రకాల సిలిండర్లను అందుబాటులో ఉంచుకోవాలి.
- కరెంటు ఓల్టేజీలో హెచ్చుతగ్గుల వల్ల ఇళ్లలోనే కాకుండా దుకాణం , పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎండకాలంలో ఎక్కువ కరెంటు వినియోగం వల్ల కూడా షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇళ్లు, దుకాణాల్లో తెగిపోయిన పాత వైర్లు, పాత బడిన స్విచ్‌లు, బోర్డులంటే వెంటనే వాటిని మార్చేయాలి. లేకపోతే వీటి వల్ల షార్ట్‌సర్క్యూట్ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.
- రాత్రి వేళ వంట పూర్తి అయిన తర్వాత తప్పకుండా గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలి. సిలిండర్‌కు ఐఎస్ఐ ముద్ర కల్గిన పైపును మాత్రమే వినియోగించాలి. రెండు రోజులు ఊరికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన తరువాత కిటికీ, తలుపులు పూర్తిగా తెరిచిన ఐదు నిమిషాల తర్వాతే కరెంటు స్విచ్‌లను ఉపయోగించాలి. సిలిండర్ నుంచి గ్యాస్ లీక్ అయితే భయపడకుండా దుప్పటి లేక ఏదో బట్ట సాయంతో సిలిండర్‌కు చుట్టి మంటను నివారించే ప్రయత్నం చేయాలి.



అగ్ని మాపక వాహనం

సహపోరు బ్యాంకు..!

ఏడీసీసీకి నలుగురు సీఈఓలు?
వర్గాలుగా విడిపోయిన ఉద్యోగులు

స్తంభించిన కార్యకలాపాలు

ఇష్టారీతిన వ్యవహరిస్తున్న వైనం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కరువు రైతును ఆదుకునేందుకు ఏర్పాటు చేసిన సహకార బ్యాంకు వర్గపోరుకు నిలయంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనంతపురం జిల్లా కేంద్ర సహకార (ఏడీసీసీ) బ్యాంకుకు నలుగురు సీఈఓలుగా వ్యవహరిస్తున్నారు. నమ్మడానికి విడ్డూరంగా ఉన్నా.. ఇది ముమ్మాటికీ వాస్తవమే. ప్రస్తుత సీఈఓతోపాటు గతంలో అదే హోదాలో పనిచేసిన ముగ్గురు ఇక్కడే పనిచేస్తున్నారు. వారు వర్గాలుగా విడిపోయి, పోరు సాగిస్తున్నారన్న చర్చ బ్యాంకు వర్గాల్లో వినిపిస్తోంది. గతంలో సీఈఓలుగా పనిచేసిన అధికారులు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లకుండా ఇక్కడే మాటు వేసుకుని కూర్చున్నారు. దీంతో బ్యాంకులో ఉద్యోగుల మధ్య విభేదాలు సృష్టించి, తమ ఉనికి కాపాడుకుంటున్నారని తెలుస్తోంది. బ్యాంకులో కింది భాగాన ఐటీ పేరుతో ఓ అధికారి, మొదటి అంతస్తులో రుణాల పేరుతో మరొకరు, రెండో అంతస్తులో అడ్మిన్ పేరుతో ఇంకొకరు ఇలా ముగ్గురు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సీఈఓ మొదటి అంతస్తులోని ప్రధాన శాఖలో ఉన్నారు. వారి తీరుతో బ్యాంకు తిరోగమనంలోకి వెళ్తోంది. గత ఐదేళ్లలో బ్యాంకును పూర్తిగా నిర్వీర్యం చేశారు. ప్రధాన కార్యాలయంలో మరో ఇద్దరు అధికారులు పదేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నారు. దీంతో బ్యాంకు కార్యకలాపాలన్నీ వారి కనుసన్నల్లోనే సాగుతున్నాయన్న చర్చ వినిపిస్తోంది. స్టేషనరీ, ఫర్నీచర్ ఇతర సామగ్రి కొనుగోలు, క్యాలెండర్, డైరీల తయారీ ఇలా ప్రతి అంశంలోనూ కమీషన్లకు కక్కుర్తి పడి బ్యాంకుపై తీవ్ర ఆర్థికభారం మోపుతున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.



జిల్లా సహకార కేంద్ర బ్యాంకు

విచారణాధికారి మార్పు

ఏడీసీసీ బ్యాంకు ఆత్మకూరు బ్రాంచ్ పరిధిలో 2015-16లో ఆరుగురు రైతులకు రూ.30 లక్షల వరకు రుణాలు ఇచ్చారు. వారివి అసైన్డ్ పట్టాలని తేల్చారు. తొమ్మిదేళ్లకుగాను మొత్తం వడ్డీతో కలిపి రూ.50 లక్షల వరకు చేరింది. ఈ రుణాల చెల్లింపులో ప్రధాన కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై విచారణ బాధ్యతను జిల్లా కేంద్రంలోని ఓ అధికారికి అప్పగించారు. విచారణ నివేదిక అందరినీ విస్తుగొలిపింది. విచారణకు ఎవరూ సహకరించడం లేదని నివేదిక సమర్పించినట్లు సమాచారం. విచారణాధికారి, అక్రమాల్లో పాలుపంచుకున్న అధికారి మధ్య సయోధ్య కుదరడంతోనే ఇలా నివేదిక ఇచ్చారనే విమర్శలు వినవస్తున్నాయి. తర్వాత జిల్లా సహాయ సహకార శాఖాధికారిని విచారణాధికారిగా నియమించారు. ఈయన ఏం చేస్తారోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



కిందిభాగంలోని ఐటీ విభాగం

చుట్టపు చూపుగా పర్సన్ ఇన్‌చార్జి

ఏడీసీసీ బ్యాంకు పాలకవర్గ పదవీకాలం ముగియడంతో జిల్లా జాయింట్ కలెక్టర్‌ను పర్సన్ ఇన్‌చార్జిగా ప్రభుత్వం నియమించింది. 9 నెలలుగా పర్సన్ ఇన్ చార్జి కొనసాగుతున్నారు. బ్యాంకులో అంతులేని అవినీతి, అక్రమాలు జరుగుతున్నా.. పర్సన్ ఇన్‌చార్జి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. సమావేశాల్లో రైతు రుణాల వడ్డీ రాయితీలో అక్రమాలు జరిగాయంటూ సహకార శాఖ అధికారులు ఆధారాలతో సమస్యను లేవనెత్తినా చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. నలుగురు అధికారులు విడిపోయి ఉద్యోగుల మధ్య చీలికలు తీసుకువచ్చినా... వారి మధ్య సమన్వయం కుదర్చడంలోనూ పర్సన్ ఇన్‌చార్జి చొరవ చూపలేకపోయారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

సమన్వయంతో పని చేయాలి

అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంది. బ్యాంకు, సొసైటీలు సంయుక్తంగా పురోగతి సాధనలో భాగస్వాములవ్వాలి. ఆత్మకూరు శాఖలో బోగస్ పట్టాలకు రుణాల ఆరోపణలపై మొదట విచారణ చేసిన నివేదిక సంతృప్తికరంగా లేదు. దీంతో డీఎల్‌సీఓను విచారణాధికారిగా నియమించారు. నివేదిక ఆధారంగా బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.



- అరుణకుమారి, జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ)

రేపటి వరకూ అభ్యంతరాల స్వీకరణ

అనంతపురం విద్య, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా టీచర్ల సీనియారిటీ జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే...ఈ నెల 26వ తేదీలోగా చెప్పాలని అనంతపురం డీఈఓ ప్రసాద్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో పని చేసే టీచర్ల సీనియారిటీ జాబితాను టిస్, డీఎస్సీల వారీగా మార్కులు, మెరిట్ ఆధారంగా రూపొందించామన్నారు. సీనియారిటీ జాబితాను అనంతపురం డీఈఓ బ్లాగ్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే... ఈనెల 26లోగా ఆధారాలతో అనంతపురం శారదానగర్‌లోని జిల్లా సైన్స్ సెంటర్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. గడువు తీరిన తర్వాత వచ్చే అభ్యంతరాలను స్వీకరించమని డీఈఓ స్పష్టం చేశారు.

సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ బదిలీ

అనంతపురం న్యూటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) అనంతపురం డివిజన్ సోషల్ ఫారెస్ట్ డీఎఫ్ఓ చంద్రశేఖర్ బదిలీ అయ్యారు. మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగంలో సుగంధ మొక్కల తయారీ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా డెప్యుటేషన్‌పై బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అజయ్‌కుమార్ నాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. టెరిటోరియల్ డీఎఫ్ఓ విఘ్నేష్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. సోషల్ ఫారెస్ట్ ద్వారా నర్సరీల అభివృద్ధికి నిధులు విడుదల కాకపోయిన ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నిధులు సమకూర్చుకొని నర్సరీల అభివృద్ధికి పెద్ద ఎత్తున చర్యలు చేపట్టేలా గత వారంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి దిశ నిర్దేశం చేశారు. అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయి సిబ్బంది సైతం పనుల ప్రారంభానికి చర్యలు చేపట్టారు. అయితే డీఎఫ్ఓ బదిలీతో ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకోనున్నా విఘ్నేష్ ఆ స్థాయిలో స్పందిస్తారా లేదా అన్నది తెలియాలంటే సిబ్బంది వేచి చూడాల్సిందే.

నాణ్యమైన సేవలే లక్ష్యం

- వేసవిలో ప్రణాళికాబద్ధంగా విద్యుత్ సరఫరా
- ఏ సమస్యకైనా 1912కు ఫిర్యాదు చేయండి
- విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్



ఇంటర్వ్యూ interview

అనంతపురంరూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ పేర్కొన్నారు. వేసవి నేపథ్యంలో ప్రణాళికబద్ధంగా విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. విద్యుత్‌కు సంబంధించి ఏ సమస్య ఎదురైనా ఏపీఎస్పీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబరు 1912కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. వేసవి నేపథ్యంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న: జిల్లాలో విద్యుత్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి.. ఎన్ని ఫీడర్ల ద్వారా వినియోగం జరుగుతోంది?

జవాబు: జిల్లా వ్యాప్తంగా గృహ కనెక్షన్లు 6.17 లక్షలు ఉన్నాయి. వీటితోపాటు కమర్షియల్, ఇండస్ట్రీస్, ప్రభుత్వ, వ్యవసాయ, ఇతర కనెక్షన్లు 2.72 లక్షలు ఉన్నాయి. వీటన్నింటికీ 707 ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోంది.

ప్రశ్న: జిల్లాలో రోజువారి విద్యుత్ వినియోగం ఎంత ఉంటోంది..?

జవాబు: వేసవి కాలం ప్రారంభమైంది. రోజువారి వినియోగం బాగా పెరిగింది. జిల్లాకు 11.857 మిలియన్ యూనిట్లు కేటాయింపులు ఉన్నాయి. ప్రస్తుతం రోజు వారిగా 11.650 మిలియన్ యూనిట్లు వినియోగమవుతోంది. వచ్చే నెల నుంచి 13.5 మిలియన్ యూనిట్లు వినియోగం జరిగే అవకాశం ఉందని అంచనా వేశాం. అందుకు అనుగుణంగా సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: వ్యవసాయానికి ఏ విధంగా సరఫరా చేస్తున్నారు..?

జవాబు: జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కనెక్షన్లు 1.84 లక్షలు ఉన్నాయి. 491 ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నాం. నీటి సమస్యలేని 89 ఫీడర్లలో 9 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మిగిలిన 402 ఫీడర్లలో రైతుల విజ్ఞప్తి మేరకు రెండు విడతల్లో సరఫరా చేస్తున్నాం. పగటి వేళల్లో 5 గంటలు, రాత్రి వేళల్లో 4 గంటల సరఫరా చేస్తున్నాం.

ప్రశ్న: వేసవిలో ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలను అధిగమించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు.?

జవాబు: వేసవిలో ఓవర్‌లోడు కారణంగా ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు ఎక్కువగా తలెత్తే అవకాశం ఉంది. మరమ్మతులకు గురైన వెంటనే క్షేత్రస్థాయిలో లైన్‌మెన్, మండల స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయాలి. పట్టణ ప్రాంతాల్లో 24 గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటల్లో ట్రాన్స్‌ఫార్మర్ మార్చాల్సి ఉంటుంది. అధికారుల నుంచి స్పందన లేకపోతే టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: విద్యుత్ సరఫరాలో అంతరాయాలను అధిగమించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తుంటాయి. లోఓల్టేజీ, హైఓల్టేజీ వంటి సమస్యలు వస్తుంటాయి. సమస్య ఎక్కువగా ఉన్నప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. అవసరం మేరకు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తాం.

నేడే ఆంధ్రజ్యోతి లక్కీడ్రా

అనంతపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి యాజమాన్యం పాఠకుల కోసం కార్ అండ్ బైక్‌రేస్‌ను ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా (అనంతపురం యూనిట్) స్థాయిలో విజేతల ఎంపిక కోసం మంగళవారం లక్కీడ్రా నిర్వహించనుంది. ఆంధ్రజ్యోతి అనంతపురం యూనిట్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ఉంటుంది. ముఖ్యఅతిథుల ద్వారా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలతోపాటు వందమంది ప్రోత్సాహక బహుమతులకు విజేతలను ఎంపిక చేస్తారు. 2024 నవంబరు నుంచి 2025 ఫిబ్రవరి వరకు ప్రతినెలా మూడు చొప్పున నాలుగు నెలలకు 12కూపన్లు ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురించారు. ఒక్కొక్క నెల కూపన్లు ఒక సెట్టుగా నాలుగు నెలలకు నాలుగు సెట్ల కూపన్లు పాఠకులు ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో అందజేశారు. పాఠకులు పంపిన వేలాది కూపన్ల నుంచి మొదటి బహుమతి బైక్, ద్వితీయ బహుమతి రిఫ్రిజిరేటర్, తృతీయ బహుమతి కలర్ టీవీ, వంద మందికి కన్సోలేషన్ బహుమతులు ఇస్తారు. అదేవిధంగా త్వరలో నిర్వహించే ఏపీ రాష్ట్ర స్థాయి లక్కీడ్రాలో బంపర్ బహుమతిగా కారు గెలుచుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం 11 గంటలకు కక్కలపల్లి క్రాస్ సమీపంలోని అనంతపురం ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో నిర్వహించే లక్కీడ్రాకు పాఠకులందరూ ఆహ్వానితులే.

ఖాద్రీశుడి హుండీ ఆదాయం రూ.82.64 లక్షలు



కదిరి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 15రోజులు బ్రహ్మోత్సవాల సందర్భంగా రూ.82,64,892లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 12 గ్రా. బంగారం, 302 గ్రా. వెండి వచ్చిందన్నారు. 21 అమెరికన్ డాలర్లు, 20 కెనడా డాలర్లు, ఆస్ట్రేలియా 20 డాలర్లతోపాటు ఒమన్ కరెన్సీ 7 రియాలు వచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో హుండీ లెక్కింపు పర్యవేక్షణాధికారి ఎన్ ప్రసాద్, కెనరాబ్యాంక్ మేనేజర్ అనంతబాబు, పలువురు సిబ్బంది ఉన్నారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య


రాజేశ్వరి (ఫైల్)

గాండ్లపెంట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూపల్లి పంచాయతీ వంకపల్లి గ్రామంలో భర్త వేధింపులు తాళలేక ఓ మహిళ సోమవారం ఆత్మహత్య చేసుకుంది. రాజేశ్వరి (29) వేపరాల సచివాలయంలో హార్టికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేసేది. పది సంవత్సరాల క్రితం వంకపల్లికి చెందిన ఈశ్వర్‌రెడ్డితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. వంకపల్లిలో ఉంటూ వేపరాల సచివాలయంలో విధులు నిర్వహించేది. కొద్ది రోజుల నుంచి రాజేశ్వరిని ఈశ్వర్ రెడ్డి వేధించేవాడు. ఆ వేధింపులు తాళలేక ఆమె తన ఇంట్లో సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇన్‌చార్జ్ ఎస్ఐ వలీబాషా సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజేశ్వరి తల్లి రామసుబ్బమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మహిళ అదృశ్యం


రూప

ధర్మవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక రాంనగర్‌కు చెందిన రూప కనిపించలేదని అత్త రమణమ్మ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమందేపల్లికి చెందిన గురురాజు, రూప దంపతులు మగ్గం నేసుకుంటూ జీవనం సాగించేవారు. ధర్మవరానికి వారం రోజుల క్రితం వలస వచ్చారు. మగ్గం నేస్తుండేవారు. దంపతుల మధ్య చిన్నపాటి గొడవలు జరుగుతుండేవి. దీంతో మనస్తాపం చెందిన రూప ఈనెల 14వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో రూప అత్త రమణమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బీటెక్ విద్యార్థిని..

బత్తలపల్లి, మార్చి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థిని కనిపించకుండా పోయింది. ఎస్ఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విద్యార్థిని అనంతపురంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. వారం రోజుల క్రితం కాలేజీకి సెలవులు ఉన్నాయని ఇంటికి వచ్చింది. ఈనెల 22వ తేదీన సాయంత్రం 5 గంటల సమయంలో ఆధార్ అప్‌డేట్ చేయంచుకుని వస్తానని చెప్పి బయటకు వెళ్లిన విద్యార్థిని రాత్రయినా తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు విద్యార్థిని తండ్రి ఫిర్యాదు చేశారు.

పోలీస్‌స్టేషన్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

తాడిపత్రి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): యల్లనూరు మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో రవికుమార్‌రెడ్డి అనే వ్యక్తి సోమవారం సూపర్‌వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. యల్లనూరు మండలం తిమ్మంపల్లి గ్రామంలో రవికుమార్‌రెడ్డి బెల్ట్‌షాపు నిర్వహించేవాడు. అయితే రెండురోజులక్రితం అతను ద్విచక్రవాహనంలో ప్రయాణిస్తూ.. ప్రమాదవశాత్తూ వేరే ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో బాధిత వ్యక్తి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఆ విషయంపై యల్లనూరు పోలీసులు రవికుమార్‌రెడ్డికి ఫోన్‌చేసి స్టేషన్‌కు పిలిపించారు. అయితే ఏమైనా పాత కేసులకు సంబంధించి విచారిస్తారన్న భయంతో అతను స్టేషన్‌లో వెంట తెచ్చుకున్న సూపర్‌వాస్మోల్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే పోలీసులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


సుంకన్న (ఫైల్)

విడపనకల్లు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు గ్రామంలో విద్యుదాఘాతంతో హెచ్ సుంకన్న(25) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పాల్తూరుకు చెందిన హెచ్ గంగన్న కుమారుడు సుంకన్న సోమవారం మధ్యాహ్నం ఇంటి ముందు తాగు నీటి కోసం మోటార్‌ను ఆన్ చేసేందుకు వెళ్లాడు. స్విచ్ వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన ప్రమీలమ్మతో మూడేళ్లక్రితం వివాహమైంది. ఆమె నెలరోజుల క్రితం తన పుట్టింటిలో ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చింది. ఇంతలోనే భర్త మృతి చెందటంతో ఆ కుటుంబం విషాదంలో మునిగింది.

యాచకురాలికి తీవ్రగాయాలు

గుత్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో విద్యుదాఘాతంతో అలహాబాద్‌కు చెందిన గన్వి అనే మహిళ తీవ్రంగా గాయపడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఆమెకు మతిస్థిమితం సరిగా లేదని, రైల్వే స్టేషన్ వద్ద భిక్షాటన చేసుకుంటూ ఉండేదని అన్నారు. సోమవారం ఆగి ఉన్న గూడ్సు రైలు బోగిపైకి ఎక్కేందుకు ప్రయత్నించిందని, పైన హైటెన్షన్ విద్యుత్ తీగలు వల్ల విద్యుదాఘాతానికి గురై కిందపడిందని తెలిపారు. దీంతో వెంటనే 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భర్తకు పదేళ్ల జైలు

పుట్టపర్తి రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగారిపల్లికి చెందిన గాయత్రిపై జరిగిన హత్యాయత్నం కేసులో ఆమె భర్త చాకలి రాజశేఖర్‌కు కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. వెంకటగారిపల్లికి చెందిన గాయత్రిపై ఆమె భర్త అనుమానంతో వేధించేవాడు. వీటిని తాళలేక గాయత్రి పుట్టింటికి వెళ్లిపోయింది. రోజులు గడిచినా ఆమె రాకపోవడంతో 2017 అక్టోబరు 11న వెంకటగారిపల్లి క్రాస్‌లో గాయత్రిపై కత్తితో దాడి చేశాడు. 2017 అక్టోబరు 12న నాటి పుట్టపర్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ వారు నేరాన్ని సాక్ష్యాధారాలతో నిరూపించారు. దీంతో అనంతపురం జిల్లా 4వకోర్టు న్యాయమూర్తి శోభారాణి ముద్దాయికి జైలు శిక్షతో పాటు రూ. ఐదు వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు.

కాలువలో పడి పదో తరగతి విద్యార్థి మృతి


విశ్వతేజ(ఫైల్)

అనంతపురం క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి ఈతకెళ్లిన పదో తరగతి విద్యార్థి మృతి చెందాడు. అనంతపురం రూరల్ మండలంలో సోమవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. మండ్ల సుబ్బారెడ్డినగర్‌కు చెందిన మంజుల ఎర్రిస్వామి కుమారుడు విశ్వతేజ(16) నగరంలోని నాలుగోరోడ్డుకు చెందిన నేతాజీ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. సోమవారం పరీక్ష రాసిన అనంతరం తన స్నేహితులు ప్రభాస్, శశాంక్, ఆచారిలో కలిసి బీఎస్ఆర్ కాలనీలో అక్కమ్మ గారి గుడి సమీపంలో చెక్‌డ్యామ్‌లో ఈతకు వెళ్లారు. అందరూ నీటిలో దిగారు. 4.30గంటల సమయంలో విశ్వతేజ నీటిలో మునిగిపోయి, మృతిచెందాడు. అనంతపురం రూరల్ సీఐ శేఖర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తేజకు ఈత సరిగా రాదని స్నేహితులు చెప్పినట్లు తెలుస్తోంది. విశ్వతేజ మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఆత్మహత్యకు యత్నించి జిల్లా సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న రైతులను పరామర్శిస్తున్న మంత్రి సవిత

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

రైతులకు మంత్రి సవిత భరోసా

(5వ పేజీ తరువాయి)

విజ్ఞప్తి చేశారు. రైతులకు జరిగిన నష్టంపై ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలుసుకున్నారని అన్నారు. ఇంత నష్టం జరిగినా మాజీ సీఎం జగన్ పరిశీలనకు రాలేదని, ఆయనకు రైతులపై ఏమాత్రం అభిమానం లేదని విమర్శించారు. రైతులకు డ్రిప్ పరికరాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇవ్వలేని జగన్ రైతు ద్రోహి అని మండిపడ్డారు.

ఆస్పత్రిలో పరామర్శ

అరటి పంట ధ్వంసం కావడంతో ఆత్మహత్యకు యత్నించిన నీర్జాంపల్లి రైతులు లక్ష్మీనారాయణ, చిన్నవెంగన్నను జిల్లా సర్వజన వైద్యశాలలో మంత్రి పరామర్శించారు. ఆరోగ్యం ఎలా ఉందని ఆరా తీశారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ, ఆర్డీఓ కేశవనాయుడుతో కలిసి ఆమె ఆస్పత్రికి వెళ్లారు. డాక్టర్లు బాగా చూస్తున్నారా అని అడిగారు. భయపడవద్దని, ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. రైతుల ఆరోగ్యస్థితి గురించి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ హేమలతను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలన్నారు.

ఆదుకోవాలి: రాంభూపాల్


వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్‌కు వినతి పత్రం ఇస్తున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గాలివానతో నష్టపోయిన ఉద్యాన రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబుతో కలిసి వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్‌కు సోమవారం ఆయన వినతి పత్రం సమర్పించారు. రెండు రోజులుగా ఉమ్మడి జిల్లాతోపాటు కడప, అన్నమయ్య జిల్లాల్లో ఈదురుగాలులు, వడగండ్ల వర్షాల వల్ల ఉద్యాన తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించారు. తాడిపత్రి, శింగనమల, ధర్మవరం నియోజకవర్గాల్లో ఎక్కువ నష్టం జరిగిందని తెలిపారు. శింగనమల, పామిడి మండలాల్లో మునగ, దానిమ్మ, బొప్పాయి తోటలకు కూడా తీవ్రంగా నష్టం జరిగిందన్నారు. పంట నష్టపరిహారం చెల్లింపులో వాస్తవ సాగుదారులైన కౌలురైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు.

రుణాలను రద్దు చేయండి: సీపీఎం


ఆత్మహత్యకు యత్నించిన రైతును పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

వడగండ్ల వానతో నష్టపోయిన అరటి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. ఆత్మహత్యకు యత్నించిన నీర్జాంపల్లి రైతులను ఆస్పత్రిలో ఆయన పరామర్శించారు. పుట్లూరు, శింగనమల, యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో రెండు వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉద్యాన పంటలు నేలకొరిగాయని అన్నారు. అరటి, బొప్పాయి, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. బాధితులలో కౌలు రైతులు కూడా ఉన్నారని అన్నారు. ఎకరానికి రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారని అన్నారు. ప్రభుత్వం సకాలంలో పరిహారం ఇవ్వాలని, బ్యాంకు రుణాలను రద్దు చేయాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, రామిరెడ్డి, బీహెచ్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.


దెబ్బతిన్న అరటితోటను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ

భూమిరెడ్డి పరామర్శ

తాడిపత్రి: ఆత్మహత్యకు యత్నించిన రైతులు లక్ష్మీనారాయణ, చిన్న వెంగప్ప కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. బాధిత రైతుల ఇళ్లవద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి, కొత్త పంట వేసుకొనేందుకు ఉచితంగా అరటి మొక్కలను ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నష్టపోయిన అరటితోటలను పరిశీలించారు.

పరిహారం ఇవ్వాలి: రామకృష్ణ


రైతును పరామర్శిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అకాల వర్షాలకు అరటి పంటదెబ్బతినిందని ఆవేదనతో పురుగుల ఆత్మహత్యకు యత్నించిన రైతులను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ పరామర్శించారు. జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీనారాయణ, చిన్నవెంగప్పను పార్టీ నాయకులతో కలిసి సోమవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారంకాదని, ధైర్యంగా ఉండాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పంటలు నేలపాలుకావడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు ఆత్మహత్యకు యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే పంట నష్టం అంచనా వేయించి రైతులకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శులు జాఫర్, వేమయ్య యాదవ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి: అనంత

అనంతపురం క్రైం: ఈదురు గాలులతో పంటలు నష్టపోయిన ఉద్యాన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో అరటి, మొక్కజొనన, దానిమ్మ, బొప్పాయి తదితర పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారిక సమాచారం మేరకే రూ.35కోట్లకు పైగా నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. యల్లనూరు, పుట్లూరు, పెద్దవడుగూరు, యాడికి, శింగనమల మండలాల పరిధిలో పంటలు చేతికొచ్చే సమయంలో నష్టం జరగడం బాధాకరమని అన్నారు. ఫిబ్రవరిలో అరటి టన్ను ధర రూ.25వేలు ఉన్నిందని, ప్రస్తుతం పూర్తిగా పడిపోయిందని, పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని అన్నారు. అధికార యంత్రాంగం సమగ్రంగా నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకునేలా ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. అరటి రైతులు ఆత్మహత్యకు యత్నించడం బాధాకరమని పేర్కొన్నారు.

పరిశీలించిన అధికారులు

తాడిమర్రి: మండల పరిధిలోని నాయనపల్లి, తురకవారిపల్లి, దాడితోట గ్రామాలలో ఈదురుగాలులకు దెబ్బతిన్న ఉద్యాన పంటలను ధర్మవరం హార్టికల్చర్ అధికారి అమరేశ్వరి సోమవారం పరిశీలించారు. రెవెన్యూ అధికారులతో కలిసి పంట నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేసుకున్నారు. రెండు రోజుల్లో ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు. వీహెచ్ఏ రామాంజినేయులు, వీఆర్ఓ కన్నప్ప పాల్గొన్నారు.


దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

ఉదిరిపికొండలో హై వోల్టేజీ విద్యుత్ సరఫరా

పలు ఇళ్లలో కాలిపోయిన విద్యుత్ పరికరాలు

కూడేరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉదిరిపికొండ గ్రామ సమీపంలోని కొత్తకాలనీలో ఇళ్లకు హై వోల్టేజీ విద్యుత్ సరఫరా కావడంతో టీవీలు, బల్బులు, ఫ్యాన్లు, ఫ్రిడ్జ్‌లు కాలిపోయాయి. సోమవారం తెల్లవారుజామున బల్బులు పగలడం, ఫ్యాన్లు కాలిపోవడం, టీవీలు , ఫ్రిడ్జిలు పేలడంతో పెద్ద ఎత్తున శబ్ధాలు వచ్చాయి. దీంతో జనం ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. కొందరు ఇళ్ల గోడలకు కరెంటు సరఫరా కావడంతో వణికిపోయారు. కాలనీకి విద్యుత్‌ను సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌కు భూమికి ఎర్త్ లేకపోవడంతో హైవోల్టేజీ కరెంట్ వస్తోందని స్థానికులు తెలిపారు. ఈ సమస్యను కరెంటు అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని మండిపడ్డారు. అధికారుల నిర్లక్ష్యంతో ఇలా జరుగుతోందని వాపోయారు. హైవోల్టేజీతో పలువురి ఇళ్లలో విద్యుత్ పరికరాలు కాలిపోయాయని, ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేదని ఊపిరి పీల్చుకున్నారు.

12 నుంచి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు

ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన జేసీపీఆర్

తాడిపత్రి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరుకోన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 12వతేదీ నుంచి ఘనంగా జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పట్టణంలోని తన నివాసంలో సోమవారం ఆలయ అర్చకులు, ఈఓ రామాంజనేయులు, కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం అర్చకులు వేదమంత్రాలతో మున్సిపల్ చైర్మన్‌ను, మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తిరుపాల్‌రెడ్డి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

పల్లవి ప్రతిభ

షాట్‌పుట్‌లో కాంస్య పతకం కైవసం



అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా జాతీయ స్థాయి పారా క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన నీలం పల్లవి ప్రతిభ చాటింది. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పల్లవి మహిళల షాట్‌పుట్‌లో కాంస్య పతకం సాధించింది. ఇప్పటికే షాట్‌పుట్‌లో జిల్లావాసి సాకే బాబు రజతం కైవసం చేసుకున్నాడు. పతకాలు సాధించిన వారిని కోచ్‌లు అభినందించారు.

అయ్యో..!

ప్రమాదాన్ని చూస్తూ వేగాన్ని తగ్గించిన లారీ డ్రైవర్

వెనుక నుంచి ఢీకొట్టి అదుపుతప్పిన మరో లారీ

డ్రైవర్ మృతి.. ఇద్దరికి గాయాలు

కనగానపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎదురుగా అవతలి వైపు వస్తున్న వాహనం అదుపుతప్పి గుంతల్లోకి దూసుకుపోతుండడాన్ని చూసి లారీ డ్రైవర్ వేగాన్ని తగ్గించాడు. వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ బలంగా ఢీకొట్టి, అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి, చెట్టును ఢీకొట్టింది. దీంతో ఆ లారీ డ్రైవర్ దుర్మరణం చెందాడు. గుంతలోకి దూసుకెళ్లి వాహనంలోని ఇద్దరు గాయపడ్డారు. మండలంలోని పర్వతదేవరపల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మామిళ్లపల్లి వైపు నుంచి అనంతపురం వైపునకు బొలెరో వాహనం వెళ్తోంది. 44వ జాతీయ రహదారిపై పర్వతదేవరపల్లి వద్దకు వెళ్లగానే అదుపుతప్పి గుంతల్లోకి దూసుకెళ్లి, బోల్తాపడింది. అదే సమయంలో ఎదురుగా అనంతపురం వైపు నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న ఖాళీ లారీ డ్రైవర్ ప్రమాదాన్ని చూస్తూ వేగాన్ని తగ్గించాడు. వెనకాలే వేగంగా వస్తున్న మరో లారీ బలంగా ఢీకొట్టి పక్కనున్న చెట్లలోకి దూసుకెళ్లింది. దీంతో వెనుకవైపు ఢీకొన్న లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుని మృతిచెందాడు. బోల్తాపడిన బొలెరో వాహనంలోని ఇద్దరు గాయపడ్డారు. వారి వివరాలు తెలియాల్సి ఉంది. కనగానపల్లి ఎస్ఐ మహ్మద్ రిజ్వాన్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి, క్యాబిన్‌లో ఇరుక్కున్న లారీ డ్రైవర్ మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడు నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం పెద్దరాసుపాళ్యం గ్రామానికి చెందిన ప్రసాద్(38)గా గుర్తించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రసాద్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

టీడీపీ నాయకుడిపై దాడి

అనంతపురం క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని మదర్‌థెరిస్సా కాలనీలో మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడిపై సోమవారం దాడి జరిగింది. రాప్తాడు మండలం గాండ్లపర్తి కొత్తపల్లికి చెందిన మోహన్‌రెడ్డి గత నాలుగు నెలలుగా మదర్‌థెరిస్సా కాలనీలో నివాసముంటున్నాడు. ఈయన ఆత్మకూరు మండలం వడ్డుపల్లిలో పెళ్లి చేసుకున్నారు. ఆ గ్రామంలో అన్నదమ్ములైన దివాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి సాగు చేసుకుంటున్న భూమిలో కొంత భాగం మాల స్వరూప్‌ది అని తెలిసింది. ఈక్రమంలో మోహన్‌రెడ్డి స్నేహితుడు ఫణీంద్రచౌదరి కొంతకాలం కిందట ఆ భూమిలో 26సెంట్లు కొనుగోలు చేశాడు. ఈనేపథ్యంలో వివాదం ఏర్పడింది. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు విషయం, కలెక్టరేట్‌లో అర్జీలు ఇచ్చే విషయంగా మోహన్‌రెడ్డి చొరవ చూపాడు. ఈ వివాదంలో జోక్యం చేసుకుంటే ఇబ్బంది పడతావని అన్నదమ్ములు మోహన్‌రెడ్డిని హెచ్చరించారు. ఆ హెచ్చరికలను ఆయన పెడచెవిన పెట్టడంతో అన్నదమ్ములిద్దరూ మోహన్‌రెడ్డి ఇంట్లో చొరబడి దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మోహన్‌రెడ్డిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తగ్గిన చింతపండు ధర

హిందూపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డులో చింతపండు ధర తగ్గింది. సోమవారం మార్కెట్‌కు 50 క్వింటాళ్ల చింతపండు వచ్చింది. గత వారంతో పోలిస్తే మేలు రకం చింతపండు క్వింటాల్‌పై రూ.3వేల దాకా తగ్గినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. కర్పూలీ క్వింటాల్‌పై రూ.3 వేల నుంచి 5వేలు తగ్గిందని రైతులు పేర్కొన్నారు. మేలురకం కర్పూలీ క్వింటా రూ.27వేలు, రెండోరకం రూ.12వేలు, మూడో రకం రూ.8వేలు ధరలు పలికాయి. ఫ్లవర్ మొదటి రకం రూ.12,400, రెండోరకం రూ.7వేలు, మూడో రోకం రూ.4250తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళవారం సాయంత్రం)	సహర్ (బుధవారం ఉదయం)
కదిరి:	6.31	5.03
ధర్మవరం:	6.36	5.02

న్యూస్ బాక్స్

నేటి నుంచి రీసర్వే

నంబులపూలకుంట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెడబల్లి, వంకమద్ది గ్రామాల్లో మంగళవారం నుంచి రీసర్వే ప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ దేవేంద్రనాయక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. రెవెన్యూ సిబ్బంది, గ్రామ సర్వేర్లు ఈ రీసర్వేలో పాల్గొంటారన్నారు. రైతుల పొలాల వద్దకు పట్టాదారు పాస్‌పుస్తకాలు, డాక్యుమెంట్లు తీసుకురావాలన్నారు.

హంద్రీనీవా లైనింగ్ ఆపాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

పుట్టపర్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులను వెంటనే ఆపాలని ఏపీ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రశాంతి గ్రామం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలువ వెడల్పు చేయాలని విడుదల చేసిన జీఓ నెంబర్లు 404,405 రదు చేయాలని, కాలువలైనింగ్ పనులను ఆపకపోతే యంత్రాలను పగలకొడతామని హెచ్చరించారు. కరువు పీడిత ప్రాంతంగా ఉన్న రాయలసీమ పంట పొలాలకు నికరసాగు జలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా ఆరు లక్షలకు పైగా ఎకరాలకు ఆయకట్టుకు నీరు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు హరి, నాగరాజు, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జలసాధన సమితి గంగిరెడ్డి, మహదేవ, కాటమయ్య, గిరీశ్, సోమశేఖర్ పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

ఓబుళదేవరచెరువు, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : స్థానిక పదో తరగతి పరీక్షా కేంద్రాలను డీఈఓ క్రిష్టప్ప సోమవారం తనిఖీ చేశారు. శ్రీవిజ్ఞాన్, విజ్ఞాన్, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను పరిశీలించారు. ఆయన వెంట అధికారులు శంకర్‌బాబు, ప్రకాష్‌నాయుడు, సుబహానుల్లా, షర్ఫొద్దీన్, సుధాకర్ ఉన్నారు.

అర్హులైన ప్లంబర్లకు న్యాయం చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు, సీపీఐ నాయకులు

ధర్మవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 650-2 సర్వేనెంబరులో అర్హులైన తమకు పట్టాలిచ్చి.. న్యాయం చేయాలని వందలాది మంది ప్లంబర్లు సోమవారం పెద్దఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ నిరసన గాంధీసర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, సిరికల్చర్ కార్యాలయ సర్కిల్ మీదుగా 650-2 సర్వేనెంబర్ స్థలాల వరకు సాగింది. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, ఏఐటీయూసీ రమణ మాట్లాడారు. యూనియన్ పేరుతో ముగ్గురు వ్యక్తులే వారి కుటుంబసభ్యుల పేరుతో అక్రమంగా పట్టాలు పొందారని ఆరోపించారు. తహసీల్దార్ నటరాజ్ అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. దీనిపై నివేదిక తయారు చేసి కలెక్టర్ అందించామని, ఆయన ఆదేశాల మేరకు అవినీతిపరులపై చర్యలు తీసుకొని.. అర్హులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు తమ నిరసనను విరమించారు.

జిల్లా అభివృద్ధికి ప్రణాళిక

నేడు కలెక్టర్లతో సీఎం కాన్ఫరెన్స్

పుట్టపర్తి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2025-26 కార్యాచరణ ప్రణాళికతోపాటు అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై కలెక్టర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం నిర్వహించనున్నారు. అమరావతిలోని సచివాలయంలో మంగళ, బుధవారాల్లో కలెక్టర్లతో నిర్వహించనున్న సమావేశంలో ప్రధానంగా జిల్లా విజన్, అభివృద్ధి, 15 శాతం జీడీపీ వృద్ధిపై చర్చించనున్నారు. ప్రధానంగా వాట్సప్ గవర్నెన్స్, ప్రజా సమస్యల పరిష్కారవేదిక, సానుకూల ప్రజాపాలన, రెవిన్యూశాఖలో భూముల సర్వే, పశుగ్రాసం, గ్రామీణ, పట్టణ తాగునీటితోపాటు మహిళా సంక్షేమం, మైనార్టీ, గిరిజన, బీసీ సంక్షేమం, ఉపాధి హామీ వంటి పథకాలపై సమీక్ష చేపట్టనున్నారు. గురువారం సాయంత్రం శాంతి భద్రతలపై సమీక్ష చేస్తారు. సమావేశంలో జిల్లాలో తొమ్మిదినెలల్లో సాధించిన లక్ష్యాలు, చేట్టాల్సిన అంశాలపై కలెక్టర్ టీఎస్ చేతన్ నివేదికతో ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు.

నేడు ఎమ్మెల్యే పల్లె సింధూర పర్యటన

పుట్టపర్తి రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మంగళవారం నియోజకవర్గంలో పర్యటి స్తారని పల్లె వ్యక్తిగత కార్య దర్శి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే కలెక్టరేట్‌లో జేసీ అభిషేక్ కుమార్ అధ్యక్షతన నిర్వ హించే ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు మానిటరింగ్ కమిటీ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కదిరి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బీసీ,ఓసీ, ఈబీసీ మహిళలకు టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల గడువు ఈనెల 25వరకు పెంచినట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది ఓ ప్రకటనలో తెలిపింది. అర్హులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు జాబ్‌మేళా: ఎమ్మెల్యే

కదిరి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్లూమూన్ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సోమవారం తెలిపారు. వివిధ కంపెనీలు ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, ఐటీఐ పాస్, ఫెయిల్ అయిన నిరుద్యోగులు అర్హులన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తన నివా సంలో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లానాయకుడు ఎద్దుల క్రిష్ణమూర్తి, జనసేన శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళా పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

భూకబ్జాదారులను శిక్షించండి

కలెక్టరేట్ వద్ద ముదిగుబ్బ మండలం అడవిబ్రాహ్మణపల్లి తండా వాసుల ఆందోళన

పుట్టపర్తిటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముదిగుబ్బ మండలం అడవిబ్రాహ్మణపల్లి తండాలో ఎంపీపీ ఆదినారాయణయాదవ్, ఆయన కుటుంబ సభ్యులు తమ భూములను కబ్జా చేశారని, వారిపై చర్యలు తీసుకొని.. తిరిగి ఆ భూములు తమకు ఇప్పించాలని బాధితులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ముందు సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో వారు ధర్నా చేశారు. గిరిజనుల భూములను ఎంపీపీ ఆయన బంధువులు అప్పనంగా రికార్డుల్లో ఎక్కించుకుని కాజేశారని చెప్పారు. ఇందుకు ఆర్డీవో, తహసీల్దార్ సహకరించారని, వారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐడీతో విచారణ చేయించి.. కేసు నమోదు చేయాలన్నారు. అనంతరం జేసీ అభిషేక్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శ్రీనివాసనాయక్, క్రిష్ణానాయక్, రవీంద్రనాయక్, రమణనాయక్, రవిబాబు, వెంకటేష్, సీపీఐ నాయకులు కదిరప్ప, మధునాయక్, బాధిత గిరిజనులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద గిరిజనులు, సీపీఐ నాయకుల నిరసన

విధులకు రాకున్నా.. హాజరు పట్టికలో సంతకాలు.!

గాండ్లపెంట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చామలగొంది పంచాయతీ కార్యదర్శి మధున్‌మోహన్‌నాయక్ గత నెల 13 రోజుల పాటు విధులకు రాలేదు. అయితే కురమామిడి సచివాలయంలో హాజరు పట్టికలో మాత్రం అతను విధులకు హాజరైనట్లు సంతకాలు ఉన్న విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. గత నెలలో గ్రూపు-2 పరీక్షల నిమిత్తం అతను విధులకు హాజరుకాలేదని సమాచారం. ఎంపీడీఓతో కుమ్మక్కై ఆయన విధులకు రాకున్నా.. హాజరు పట్టికలో సంతకాలు చేశారనే ఆరోపణలున్నాయి. దీనిపై ఎంపీడీఓ వెంకటరామిరెడ్డిని వివరణ కోరగా.. అతను విధులకు హాజరుకాలేదనే విషయం తన దృష్టికి రాలేదని, విచారణ చేసి.. తగు చర్యలు తీసుకుంటామని అన్నారు.



హాజరు పట్టికలో సంతకాలు చేసిన కార్యదర్శి

రోడ్లపై అక్రమ నిర్మాణాలు తొలగించండి

కొత్తచెరువు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు రోడ్లను ప్రజలు ఆక్రమించి.. ఇంటి నిర్మాణాలు, ఇంటి మెట్లు, సంపులు నిర్మించుకున్నారని, దీంతో రోడ్లు ఇరుకుగా మారాయని, ఆ ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. సోమవారం ఈ మేరకు బీజేపీ మండల కన్వీనర్ గంగానాయుడు, శేషాద్రినాయుడు, రామానాయుడు, ఏలుకుంట్ల రవి స్థానిక ప్రజాపరిష్కార వేదికలో తహసీల్దార్ నీలకంఠారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

● ఇంటిపట్టాలు ఇవ్వాలని ధర్నా

ఓబుళదేవరచెరువు : మండలంలోని అర్హులైన తాపీమేస్త్రీలు, హమాలీలకు ఇంటిపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం తాపీమేస్త్రీ సంఘం నాయకులు పీట్ల సుధాకర్, బీజేపీ మండల కన్వీనర్ ఇడగట్టు వీరాంజినేయులు ఆధ్వర్యంలో వారు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ అనంతచారికి వినతి పత్రం అందించారు.

● వేతనాలు వెంటనే చెల్లించాలి

తమకు బకాయి ఉన్న ఎనిమిది నెలల జీతాలు మంజూరు చేయాలని ఓబుళదేవరచెరువు పంచాయతీ కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి కుళ్లాయప్ప మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్, క్లాప్ మిత్ర కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు మంజూరు చేయాలన్నారు అనంతరం తహసీల్దార్ అనంతచారికి వినతి పత్రం అందచేశారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్మికులు అంజనప్ప, గంగులప్ప, లక్ష్మీదేవి, నిర్మల, శ్రావణి, సాలెమ్మ, నాగమ్మ, ఓబులమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

● కందిపంటకు నిప్పుపెట్టారు

ధర్మవరంరూరల్ : తమ పొలంలో ఉన్న కందిపంటకు నిప్పుపెట్టడంతో తాను రూ. 50 వేల నష్టపోయానని ధర్మవరం పట్టణంలోని శివానగర్‌కు చెందిన రైతు జంగం లింగప్ప వాపోయాడు. ఈ మేరకు సోమవారం ఆర్డీఓ మహేష్‌కు సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ప్రజాపరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. తుమ్మల గ్రామపొలంలో సర్వేనెంబర్ 65లోని మూడు ఎకరాల్లో కందిపంటను సాగుచేశానని, అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు నిప్పుపెట్టడంతో పంట మొత్తం కాలిపోయిందని వాపోయారు. దీనిపై విచారణ చేయాలని ఆర్డీఓ రూరల్ పోలీసులకు ఆదేశించినట్లు ఆ రైతు తెలిపారు.





కొత్తచెరువు : తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు, ఓడీసీ : తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న తాపీ మేస్త్రీలు

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

ముదిగుబ్బ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపడంపై ఎమ్మార్పీఎస్, అంబేద్కర్ సేవాసమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. చంద్రబాబు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు సాకే రంగనాయకులు, దొరిగల్లు నరసింహ, రామాంజి, గంగప్ప, కంచర్ల రవి, ఆదెప్ప, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● నల్లమాడ : ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మందక్రిష్ణ మాదిగ చిత్రపటాలకు మండల కేంద్రం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎస్సీసెల్ అధ్యక్షుడు రవికుమార్, పార్లమెంటు ఎస్సీసెల్ సభ్యుడు రామప్ప, నియోజకవర్గ అధ్యక్షుడు త్రిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● ధర్మవరంరూరల్: ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో ఆమోదం పొందడంతో ధర్మవరంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లోని అంబేద్కర్ విగ్రహానికి టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ జిల్లా నాయకుడు కేశగాళ్ల శ్రీనివాసులు, ధర్మవరం ఎమ్మార్పీఎస్ నాయకుడు కేశగాళ్ల వెంకటేష్, ఎస్సీ జనసంఘం దాసగాని కుళ్లాయప్ప, టీడీపీ పట్టణ ఎస్సీసెల్ సాకే కుళ్లాయప్ప, బాలకృష్ణ పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

దెబ్బతిన్న అరటి పంట పరిశీలన

ముదిగుబ్బ, మార్చి24(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందుకూరు, కొడవండ్లపల్లి, మర్తాడు, ఈదులపల్లి, దొరిగల్లు, కొండగట్టుపల్లి, కోటిరెడ్డిపల్లి గ్రామాల్లో ఈదురు గాలుల కారణంగా దెబ్బతిన్న అరటి తోటలను బీజేపీ నేత హరీష్‌బాబు సోమవారం పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి నష్టపరిహారం తక్షణమే అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, రైతులు ఉన్నారు.

జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దాలి

ఎక్సైజ్ ఉమ్మడి జిల్లా డీసీ నాగమద్దయ్య



పుట్టపర్తి రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాను సారా రహితంగా తీర్చితిద్దాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో సోమవారం ఆయన ఎక్సైజ్ సూపరిండెంట్ నరసింహులుతో కలిసి ఎక్సైజ్ ఎస్ఐలు, సీఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏ, బీ, సీ గ్రామాల్లో నాటుసారా తయారీ, అమ్మకందారులపై నిఘా పెంచాలని పాత నేరస్తులను, అనుమానితులను గుర్తించి బైండోవర్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఇతర రాష్ట్రాల మద్యం జిల్లాలో చొరబడకుండా అరికట్టాలన్నారు. మద్యం షాపుల్లో నిబంధలు పాటించేలా చూడాలన్నారు. సమావేశంలో పుట్టపర్తి ఎక్సైజ్ సీఐ నాగరాజు, ఎస్ఐలు, సీఐలు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల అపహరణ

ధర్మవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో రెండు ద్విచక్రవాహనాలు చోరీ అయ్యాయి. కొత్తపేట రాంనగర్‌కు చెందిన వేణుగోపాల్‌కు చెందిన స్కూటీ, సుందరయ్య నగర్‌కు చెందిన సునీతకు చెందిన స్కూటీ ఆదివారం రాత్రి వారి ఇళ్ల ముందు పార్కింగ్ చేశారు. దుండగులు వాటిని అపహరించారు. సోమవారం ఉదయం ద్విచక్రవాహనాలు లేకపోవడంతో బాధితులు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసులు దర్యాప్తులో ఉన్నాయి.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ

తనకల్లు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటి క్రాస్‌లో ఫైవ్‌స్టార్ కబాబ్ సెంటర్‌ను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రుయ్య సోమవారం తనిఖీ చేశారు. ఆ కబాబ్ సెంటర్‌లో కుళ్లిన మాసంతో కబాబ్ తయారు చేసి విక్రయిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో ఆయన ఈ తనిఖీలు నిర్వహించారు. ఆ సెంటర్‌లో మాసంతో తయారుచేసిన కబాబ్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.



తనిఖీ చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

చౌకబారు రాజకీయాలు మానుకోండి: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కదిరి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఇంకనైనా చౌకబారు రాజకీయాలు మానుకోవాలని పలువురు టీడీపీ నాయకులు హితవు చెప్పారు. సోమవారం ఆర్‌అండ్‌బి భవనంలో వారు మాట్లాడుతూ.. గాండ్లపెంట మండలంలోని చామలగొంది వైసీపీకి సంబధించిన ఎంపీటీపీ లక్ష్మీదేవి, ఆమె కుటుంబ సభ్యులు కనిపించలేదని, ఎంపీటీపీ మరిది రవికుమార్ వైసీపీ నాయకుల మీద ఫిర్యాదు చేశారని చెప్పారు. దానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు, టీడీపీ నాయకులకు ఏమి సంబంధమని ప్రశ్నించారు. టీడీపీపై చౌకబారు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. తరచూ పార్టీలు మారుతూ.. భూకబ్జాలు చేసే నాయకులు కూడా తమ నాయకుడి గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పర్వీనాబాను, డైమండ్ ఇర్ఫాన్, కౌన్సిలర్ అల్లాముస్తఫా, మహబూబ్ బాషా, బాహద్దీన్, ఖాదర్‌బాషా, సల్మాన్ పాల్గొన్నారు.

డివైడర్లపై తోపుడుబండ్ల తొలగింపు



డివైడర్లపై ఉన్న తోపుడుబండ్లను తొలగిస్తున్న సిబ్బంది

కొత్తచెరువు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక బుక్కపట్నం రహదారి మధ్యలో ఉన్న డివైడర్లపై కొందరు తోపుడుబండ్లు ఏర్పాటుచేసుకుని వ్యాపారులు చేసుకుంటున్నారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగేది. దీనిపై స్థానికులు సీఐ ఇందిరాకు పలుమార్లు ఫిర్యాదు చేసినా.. ఆమె పట్టించుకోలేదు. ఇటీవల ఆమె బదిలీపై వెళ్లడంతో.. ఇన్‌చార్జ్‌గా పుట్టపర్తిరూరల్ సీఐ సురేశ్‌ను ఎస్పీ నియమించారు. ఆయన బాధ్యతలు చేపట్టగానే స్థానిక ప్రజలు, నాయకులు ట్రాఫిక్ సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సీఐ సోమవారం డివైడర్లపై ఉన్న తోపుడు బండ్లను తీసివేయించారు.

29న సర్వసభ్య సమావేశం

నల్లమాడ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 29న సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాబర్టు విల్సన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సునీతబాయి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీ, కో-ఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీ, అన్ని శాఖలాధికారులు హాజరుకావాలన్నారు.

హోంమంత్రి పుట్టినరోజు

ముదిగుబ్బ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత జన్మదిన వేడుకలను హిందూపురం సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ హేమలతాభాయ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. స్థానిక బాలికల వసతి గృహంలో విద్యార్థుల నడుమ కేక్ కట్ చేశారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ

ధర్మవరం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినాన్ని పురష్కరించుకొని వైద్యులు, వైద్యసిబ్బంది ప్రభుత్వాస్పత్రి నుంచి సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మాన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి, దర్శినమల మెడికల్ ఆఫీసర్లు పుష్పలత, శ్వేత, టీబీ యూనిట్ సూపర్‌వైజర్లు క్రిష్టప్ప, రహమత్ బాషా, ఎరికలప్ప, బాలాజీనాయక్, ఆశాకార్యకర్తలు, స్వచ్ఛందసంస్థ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● తనకల్లు : మండలంలోని కొక్కంటి క్రాస్‌లో క్షయవ్యాధి నిర్మూలనపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి, డాక్టర్లు ధర్మరాజు, లోకేశ్వర్‌రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

● ముదిగుబ్బ : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో మండల వైద్యాధికారి శ్వేత, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని మలకవేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రోజా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

● కదిరిఅర్బన్: ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినం సందర్భంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్, వైద్యులు ఉషారాణి, సులేమాన్, జనజాగృతి సిబ్బంది, ఏఆర్టీ, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

● నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్యులు దీప్తి ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం నుంచి రెడ్డిపల్లి బస్టాండ్ వరకు ఈ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రామాంజులు, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్ర, సూపర్‌వైజర్లు మంజుల, ఎస్ఎం బాషా, వైద్య సిబ్బంది, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.





ధర్మవరం, ముదిగుబ్బలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది, గ్రామస్థులు

ప్రిన్సిపాల్‌పై అక్రమ కేసును కొట్టివేయాలి

పుట్టపర్తి రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కదిరికి చెందిన ఎస్కేఎల్ఎన్ఎస్ అమృతవల్లి మహిళా డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ వెంకటపతి తమతో అసభ్యంగా ప్రవర్తించలేదని, అతనిపై పెట్టిన అక్రమ కేసును కొట్టివేయాలని ఆ కళాశాల విద్యార్థినులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానికంగా నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో డీఎస్పీ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. తండ్రీ కూతుళ్ల లాంటి సంబంధం ఉన్న గురుశిష్యులను కొందరు జులాయిలు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి సోషియల్ మీడియాలో పెట్టారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

న్యూస్ బాక్స్

రూ.15 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

వెంకటేశులు, పీఆర్ డీఈ

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



మడకశిర, మార్చి, 24 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మడకశిర సబ్‌డివిజన్ పరిధిలో రూ.15 కోట్లతో 214 గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి ప్రతిప్రాదనలు పంపామని పంచాయతీ రాజ్ శాఖ డీఈ వెంకటేశులు తెలిపారు. ఆయన సోమవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న : నియోజకవర్గంలో ఎన్ని గ్రామాల్లో ఎన్ని కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు..?

జవాబు: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా 15 కోట్లతో 214 గ్రామాలలో 26.88 కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాం.

ప్రశ్న: అందుకు సంబందించిన బిల్లులు చెల్లించారా..?

జవాబు: రూ.15 కోట్లకుగాను 14.50 కోట్ల వరకు సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాం. వాటికి సంబంధించి బిల్లులు పంపాం. త్వరలోనే చెల్లిస్తాం.

ప్రశ్న: నియోజకవర్గంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపారా..?

జవాబు: దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు నాబార్డు కింద రూ.3కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు అయిన వెంటనే పనులు చేపడతాం.

ప్రశ్న: దెబ్బతిన్న కల్వర్టుల మరమ్మతులకు నిధులు మంజూరు అయ్యాయా..?

జవాబు: రొళ్ల మండలం హెచ్‌టి హళ్లి గ్రామం జడ్‌పిహెచ్ఎస్ స్కూల్ వద్ద, బిజిహళ్లి గ్రామంలో కల్వర్టులు దెబ్బతిన్నాయి. ఎంజీఎన్ఆర్‌జీఎస్ కింద మంజూరు అయిన రూ70లక్షలతో కొత్తగా కల్వర్టులను నిర్మిస్తున్నాం.

చోళమయ్యకు విశేష పూజలు



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పావగడ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పళవల్లి చోళమయ్య స్వామికి సోమవారం విశేష పూజలు జరిగాయి. ఉదయం నుంచి భక్తులు ఆలయంలోని ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకుని కోరికలు అడిగితే తప్పక తీరుతాయని గ్రామస్థుల నమ్మకం. ఉదయం 4 గంటల నుంచే భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

దరఖాస్తు చేసుకోండి

గుడిబండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గుడిబండ, గుండుమల, టేకులోడు, నసనకోట, బుక్కపట్నం, రాంపురం, లేపాక్షి, పేరూరు, బత్తలపల్లి, రొద్దం తదితర చోట్ల ఉన్న గురుకుల బాలికల కళాశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గుడిబండ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 27వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. 6,7,8,9వ తరగతుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 28న, ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, జూనియర్ ఇంటర్‌లో చేరేవారికి మే 4వతేదీ ఆదివారం 10.30 గంటల నుండి 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడి ఎంపిక



ఎంపికైన బార్ అసోసియేషన్

మడకశిరటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మడకశిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అశ్వర్థనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం మడకశిర బార్ అసోసియేషన్ కార్యాలయంలో కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు ఎలక్షన్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఉపాధ్యక్షుడిగా హెచ్.ఎస్. క్రిష్టప్ప, జనరల్ సెక్రెటరీగా కె.సి.ఉమేష్‌చంద్ర, జాయింట్ సెక్రెటరీగా దివాకర్, ట్రెజరర్‌గా నాగరాజులుతోపాటు కె.రంగనాథ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు తెలిపారు. కొత్తగా ఎంపికైన సభ్యులకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

పనులు వెంటనే చేపట్టండి

కాంట్రాక్టర్లతో మున్సిపల్ చైర్మన్


హిందూపురం అర్బన్, మార్చి24(ఆంధ్రజ్యోతి): రోడ్లు, కాలువలకు సంబంధించిన పనులను వెంటనే చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ రమేష్ కాంట్రాక్టర్లను కోరారు. సోమవారం ఆయన తన చాంబర్‌లో కాంట్రాక్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేసిన పనులకు బిల్లులు రావని దిగులుచెందవద్దన్నారు. ప్రభుత్వం నుంచి మంజూరైన పనులను చేపట్టాలన్నారు. పూర్తయిన పనులకు బిల్లులు అందేలా చర్యలు చేపడతామన్నారు.



కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న చైర్మన్ రమేష్‌కుమార్

కొండలకు నిప్పు... గ్రామాల్లోకి వన్యప్రాణులు

- భయాందోళనలో పరిసర గ్రామాల ప్రజలు
- ఇటీవల అధికమైన ఎలుగుబంట్ల దాడి
- అటవీశాఖ అధికారులు స్పందించాలని వేడుకోలు



అటవీ, కొండ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న పొలాలు



గ్రామ పొలిమేర్లలో సంచరిస్తున్న ఎలుగుబంట్లు

మడకశిర, మార్చి24(ఆంధ్రజ్యోతి): వణ్యప్రాణులు జనవాసాల్లోకి వస్తుండడంతో ఆ పరిసర ప్రాంత్రాలలోని ప్రజలు బయాందోళనకు గురవుతున్నారు. ఇటీవలి కాలంలో కొండలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెడుతుండడంతో వణ్యప్రాణులు అవీ కొండప్రాంతాలు వదిలి గ్రామాల సమీపంలోకి, పొలాల వైపు వస్తున్నాయి. గతంలో కంటే ప్రస్తుతం ఎలుగుబంట్ల బెడద అధికం అయ్యిందని గ్రామస్థులు అంటున్నారు. అమరాపురం మండలంలో ఇటీవల ఓ వ్యక్తిపై ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచింది, అతడిని చికిత్స నిమిత్తం కర్ణాటకలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. మడకశిర మండలం సరిహద్దులోని కర్ణాటక ప్రాంతంలోని కిల్లారపల్లి గ్రామంలో ఎలుగుబంట్లు సంచరిస్తున్నాయి. రెండు ఎలుగుబంట్లు రావడంతో గ్రామస్థులు కలిసికట్టుగా వాటిని గుట్టపైకి తరిమారు. గతంలో ఎలుగుబంట్లు పొలాలు, బోర్ల వద్దకు వచ్చేవి. ప్రస్తుతం గ్రామాల్లోకి వస్తుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి పూట బయటికి రావాలన్నా, పొలాల వద్దకు వెళ్లాలన్నా ఎలుగుబంట్లతో భయం వేస్తోందని అంటున్నారు. ఇటీవల కొండలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెడుతుండడంతో ఆ ప్రాంతంలోని వణ్యప్రాణాలు కాస్త గ్రామాల్లోకి వస్తున్నాయి. కర్ణాటక సరిహద్దు ప్రాంతం అయిన మడకశిర నియోజకవర్గంలో 50శాతం పైబడి కొండలు గుట్టలకు ఆనుకుని గ్రామాలు, పొలాలు ఉన్నాయి. కర్ణాటకకు ఆనుకుని ఉండడంవల్ల ఆ ప్రాంతం నుంచి కూడా వణ్య ప్రాణులు మన ప్రాంతంలోకి వస్తుంటాయని గ్రామస్థులు అంటున్నారు. కొండల్లో గుట్టల్లో వణ్యప్రాణులకు ఆహారం, తాగడానికి నీరు దొరకకపోవడంతో అవికాస్త వ్యవసాయ బోర్ల, పంట పొలాల వద్దకు రావడం జరుగుతోందని వివరిస్తున్నారు. అటవీశాఖ అధికారులు కొండలకు నిప్పు పెట్టకుండా చూడాలని, అదేవిధంగా వన్యప్రాణులు ముఖ్యంగా ఎలుగుబంట్లు తదితర క్రూరమైన జంతువులు గ్రామాల వైపు రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు..!

ఆదమరిస్తే అంతే సంగతులు



మారుతీనగర్‌కు వెళ్లే దారిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

సోమందేపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదం పొంచి ఉంది. కొన్నేళ్లుగా ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె లేకపోవడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా ఆదమరిచి అడుగేస్తే అంతే సంగతులని కాలనీల ప్రజలు వాపోతున్నారు. సంబంధిత శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏదైనా జరగరాని సంఘటన జరిగి ప్రాణాలు కోల్పోతేనే చర్యలు తీసుకుంటారా అని విద్యుత్ శాఖ అధికారులను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు గోరంట్ల రోడ్డు మారుతినగర్, కొత్తపల్లి రహదారిలో పాత హైస్కూల్‌వద్ద, పాతూరులో పలుచోట్ల కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు దర్శనమిస్తున్నాయి. నిత్యం ప్రజలు పనులపై రాకపోకలు కొనసాగిస్తుంటారు. చిన్నారులు, విద్యార్థులు ఆడుకుంటూ అటువైపు వెళ్లినా ప్రమాదం బారినపడే అవకాశం ఉంది. కనీసం ప్రమాద సూచికలు కూడా ఏర్పాటు చేయలేదు. మండల కేంద్రంలో పది వరకు ఇలాంటి ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నాయి. వాటికి కంచె ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలం అవుతున్నారు. ప్రమాదం జరగకముందే వాటికి కంచె ఏర్పాటు చేసి ప్రాణాలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. వీటిపై విద్యుత్‌శాఖ ఏఈ పరమేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా కంచె ఏర్పాటు కోసం అవసరమయ్యే నివేదికలు తయారుచేశామన్నారు. వాటికి అయ్యే నిధులు సంబంధిత నివేదికలు ఉన్నతాధికారులకు సమర్పించామన్నారు. త్వరలో అన్ని ట్రాన్స్‌ఫార్మర్‌లకు కంచెను ఏర్పాటు చేస్తామన్నారు.

బకాయిలపై దృష్టి పెట్టండి

చైర్మన్ ఉమర్ ఫారూక్


రూ.13.22 కోట్లతో అంచనా బడ్జెట్ ఆమోదం



మాట్లాడుతున్న చైర్మన్ ఉమర్ ఫారూక్

పెనుకొండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పన్నుల బకాయిలపై దృష్టి పెట్టాలని చైర్మన్ ఉమర్‌ఫారూక్ ఆదేశించారు. సోమవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నగర పంచాయతీకి సంబంధించి 2025-26ఆర్థిక సంవత్సరానికి రూ.13.22కోట్లతో అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ముందుగా బడ్జెట్ ప్రతిపాదనను చైర్మన్ చదివి వినిపించారు. 2025-26లో ప్రారంభ నిలువ రూ.8,98,17,550కాగా సాధారణ జమలు రూ.5,19,25,426, మూలధనం జమలు రూ.3,06,95,000 మొత్తం రూ.17,26,37,970కు గాను సాధారణ ఖర్చులు రూ.4,02,32,000, మూలధనం ఖర్చులు రూ.4.12కోట్లు మొత్తం రూ.4,02,37,000 ముగింపు నిలువ రూ.13,22,00,976 అంచనాతో బడ్జెట్‌ను ప్రతిపాదించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం చైర్మన్ ఫారూక్ మాట్లాడుతూ నగర పంచాయతీ అభివృద్ధికి మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి సహకారం అందించాలని కోరారు. అందరి సహకారంతో నగర పంచాయతీ అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు. వార్డుల్లో వీధి దీపాలు సక్రమంగా వెలగడంలేదని, ఈ సమస్యపై దృష్టిసారించి చర్యలు చేపట్టాలని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో కమిషనర్ సతీష్‌కుమార్, ఆర్ఐ దినేష్‌కుమార్, వైస్ చైర్మన్ సునీల్‌కుమార్, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా జలధి మహోత్సవం



ఉత్సవంలో పాల్గొన్న గుండుమల తిప్పేస్వామి, టీడీపీ నాయకులు

మడకశిరటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వడ్రపాళ్యంలో వెలిసిన వెంకటేశ్వరస్వామి జలధి ఉత్సవం సోమవారం ఘనంగా సాగింది. స్వామివారికి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి జలధిం సాగింది. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి, పలువురు టీడీపీ నాయకులు ఉత్సవంలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలుచేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జిల్లా అధికారి ప్రతినిధి నాగరాజు, మీడియా కోఆర్డినేటర్ రవికుమార్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

బందోబస్తు కల్పించండి

సోమందేపల్లి, మార్చి24(ఆంధ్రజ్యోతి): పాతూరులో వెలసిన చౌడేశ్వరి అమ్మవారి పంచమ జ్యోతుల ఉత్సవానికి భారీ ఎత్తున భక్తులు తరలి రానున్నారని, బందోబస్తు కల్పించాలని ఆలయ ధర్మకర్త డీసీ ఈశ్వరయ్య పోలీసులను కోరారు. ఈనెల 31న వేడుక జరగనుందని బందోబస్తు ఏర్పాటు చేయాలని సోమవారం పోలీసులకు వినతిపత్రం సమర్పించారు.

అనుమానాస్పద స్థితిలో జార్ఖండ్‌వాసి మృతి

గోరంట్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం నాసిన్ కంపెనీలో పనిచేస్తున్న జార్ఖండ్‌కు చెందిన సతాన్‌కార్వా (71) అనుమానాస్పంద స్థితిలో మృతిచెందినట్లు సీఐ శేఖర్ తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రంలోని లేతర్ జిల్లా చంచా గ్రామానికి సతాన్‌కార్వా నాసిన్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. ఈనెల 22 రాత్రి విధులు ముగించుకుని భోజనం చేసి నిద్రించారు. ఉదయం ఎంతసేపయినా లేయకపోవడంతో సహచరులు వెంటనే అతడిని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. హిందూపురం ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. కుమారుడు యోగేంద్రకర్వా ఫిర్యాదు మేరకు గోరంట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. మృతికి గలకారణాలు తెలియాల్సి ఉంది. అనారోగ్యంతో మృతి చెందారా..? ఇతర కారణాలో మృతిచెందారా..? తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

హిందూపురం అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో ఫయాజ్‌కు తీవ్రగాయాలయ్యాయి. సోమవారం మధ్యాహ్నం ఆజాద్‌నగర్‌కు చెందిన ఫయాజ్ చర్చిరోడ్డులో ద్విచక్రవాహనంలో వెళ్తూ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేశారు.

ఇరువురిపై కేసు నమోదు

గోరంట్ల, మార్చి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరావులపల్లి తండాకు చెందిన రంజిత్‌నాయక్‌పై అతడి బంధువులు దాడి చేసి గాయపరిచినట్లు సీఐ శేఖర్ తెలిపారు. గతంలో రంజిత్‌నాయక్ భూతగాదా విషయంపై బంధువులైన చరణ్‌తేజ్‌నాయక్, మోతీలాల్‌నాయక్‌లపై కేసు పెట్టాడు. ఈనేపథ్యంలో ఈనెల 20న రంజిత్‌నాయక్‌పై వారు దాడిచేశారు. రంజిత్‌నాయక్ ఫిర్యాదు మేరకు ఇరువురికిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు

రొళ్ల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పోషనా బీ.. పడాయి బీ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. చిన్నారులకు విద్యను అందించే విధంగా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ షెక్షావలి, సీడీపీఓ నాగమల్లేశ్వరి, హెచ్‌ఎం అలిముల్లా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

గోరంట్ల, మార్చి24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సభ్యత్వం తీసుకున్నవారికి సోమవారం కార్డులు పంపిణీ చేశారు. గోరంట్ల మండల కన్వీనర్ సోముశేఖర్ ఆధ్వర్యంలో టీడీపీ బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలకు సభ్యత్వ కార్డులు అందించారు.

సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్డులను నాయకులు పంపిణీ చేశారు. బూత్‌లవారీగా కార్డులను అందజేయడం జరిగిందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, కన్వీనర్ సిద్దలింగప్ప, టౌన్ కన్వీనర్ సూరి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గవ్యాప్తంగా 35 మందికి సీఎం సహాయక నిధి చెక్కులను బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పంపిణీ చేశారు. సోమవారం పార్టీ స్థానిక కార్యాలయంలో పెనుకొండ, రొద్దం, పరిగి, గోరంట్ల మండలాలకు చెందిన 35 మందికి రూ.33.86 లక్షల చెక్కులు అందజేశారు. అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే పెనుకొండ నియోజకవర్గంలో 93 మందికి 83 లక్షలు బాధితులకు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కేశవయ్య బాబుల్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య కార్యదర్శిగా లక్ష్మణ్‌రావు

పెనుకొండ రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవాసంఘం సమైఖ్య కార్యదర్శిగా పరిగికి చెందిన లక్ష్మణ్‌రావు ఎంపికైనట్లు రాయలసీమ కోఆర్డినేటర్ ప్రసాద్‌రావు తెలిపారు. సోమవారం బ్రాహ్మణ సేవాసంఘం కార్యదర్శి లక్ష్మణ్‌రావు, కోఆర్డినేటర్ ప్రసాద్‌రావు పెనుకొండ టీడీపీ క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని మంత్రి సన్మానించారు.

తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్య



ట్రాఫిక్ సమస్యతో పెద్దసంఖ్యలో నిలిచిన వాహనాలు

పరిగి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): హిందూపురం నుంచి పరిగికి వెళ్లే ప్రధాన రహదారి కొడిగేపల్లి బస్టాండు నుంచి గ్రామ సమీపం వరకు ట్రాఫిక్ సమస్యగా మారింది. కొంతకాలంగా రహదారి నిర్మాణపనులు ప్రారంభించి రోడ్డును వెడల్పు చేశారు. దీంతో ప్రయాణికుల ఇబ్బందులు తగ్గాయి. హిందూపురం వెళ్లేందుకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలేకుండా సజావుగా గమ్యాన్ని చేరుకోవచ్చని అభిప్రాయపడ్డారు. కాకపోతే కొడిగెనహళ్లి బస్టాండు నుంచి పరిగి వైపునకు వెళ్లేదారిలో ఏవైనా పెద్దవాహనాలు ప్రయాణస్తే ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోంది. భవనాలు అడ్డంగా ఉన్నాయన్న నెపంతో రోడ్డు వెడల్పు చేయకుండా అలాగే వదిలేశారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఎదురైనప్పుడు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు రహదారి వెడల్పుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్షయ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతాం

సూపరింటెండెంట్ డాక్టర్ మోహన్‌నాయక్

పెనుకొండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతో క్షయరహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోహన్‌నాయక్ అన్నారు. సోమవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. 'టీబీ అంతం... మన పంతం ' నినాదంతో ముందుకెళ్లాలని సూచించారు. టీబీ లక్షణాలను ప్రజలకు వివరించి వారిలో అవగాహన కల్పించాలన్నారు. ఆకలి మందగించడం, రాత్రిపూట ప్రతిరోజూ జ్వరం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలకు, క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉదయ్‌కిరణ్, సిబ్బంది రెడ్డమ్మ, శశిధర్, అబ్దుల్‌అహ్మద్, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి అవార్డు



జేసీ నుంచి అవార్డు అందుకుంటున్న పంచాయతీ కార్యదర్శి

పెనుకొండ రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రమంచి పంచాయతీ కార్యదర్శి జితేంద్రకు అవార్డు లభించింది. టీబీ వ్యాధి నివారణ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన జితేంద్రకు జిల్లా కేంద్రంలోని పుట్టపర్తి సమస్యల పరిష్కార వేదికలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఉత్తమ అవార్డును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా జితేంద్రని కార్యాలయ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది అభినందించారు.

ఆటో నుంచి పడి విద్యార్థిని మృతి

హిందూపురం అర్బన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి కిందపడి విద్యార్థిని వైష్ణవి (14) మృతి చెందిన ఘటన సోమవారం ఉదయం చోటు చేసుకుంది. కొట్నూరుకు చెందిన నరసింహమూర్తి కుమార్తె ఆటో ఆపేలోపు దిగడానికి వెళ్లి జారి కిందపడగా తలకు తీవ్ర గాయమైంది. వెంటనే హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు

పెనుకొండ టౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నందుకు ఓ ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్‌పై పోక్సో కేసు నమోదుచేసినట్లు సీఐ శేఖర్ సోమవారం తెలిపారు. 15 రోజులుగా తనపట్ల ప్రిన్సిపాల్ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని, పద్ధతి మార్చుకోవాలని వినడం లేదని ఎస్పీ రత్నకు బాధిత విద్యార్థిని సోమవారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అతడిపై కేసు నమోదుచేసినట్లు సీఐ వెల్లడించారు.